

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శనివారం 11-04-2026 | సంపుటి - 27 | సంచిక -319 | రూ : 4 | పేజీలు: 8

### తాటాకు చప్పుళ్లకు బెదరం
## పొంగులేటి కౌంటర్

- కూసుమంచి మండలంలో కొత్తగా నిర్మించిన గోదామును ప్రారంభించిన పొంగులేటి
- గత ప్రభుత్వ ధరణి పోర్టల్ వల్ల రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారన్న మంత్రి
- రైతు భరోసా కింద ప్రతి ఎకరానికి రూ. 12 వేలు అందిస్తున్నామని వెల్లడి
- ఇందిరమ్మ రాజ్యాన్ని మరోసారి దీవించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని వ్యాఖ్య

2లో





## 20న బీఆర్ఎస్‌లోకి జీవన్‌రెడ్డి

- జగిత్యాలలో భారీ బహిరంగసభ : ముఖ్యఅతిథిగా రావాలంటూ కేసీఆర్‌కు జీవన్‌రెడ్డి విజ్ఞప్తి
- ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో భేటీ
- మీతో కలిసి పనిచేయాలని ఆ దేవుడే పంపాడన్న మాజీమంత్రి

2లో

### కాంగ్రెస్ నేత పవన్ ఖేరాకు
## తెలంగాణ హైకోర్టులో భారీ ఊరట

- అ వారం రోజుల పాటు మధ్యంతర ముందస్తు బెయిల్ మంజూరు
- అస్సాం సీఎం భార్యపై ఆరోపణల నేపథ్యంలో నమోదైన కేసు
- వారం రోజుల్లోగా అస్సాంలో రెగ్యులర్ బెయిల్ దాఖలుకు అవకాశం
- ఇది రాజకీయ కక్ష సాధింపేనని వాదించిన పవన్ ఖేరా తరపు న్యాయవాది

2లో





### అందరి చూపు
## ఇస్లామాబాద్ వైపు

- కొ నేడే అమెరికా .. ఇరాన్ ప్రతినిధుల మధ్య కీలక చర్చలు యుద్ధం ముగింపునకు పరిష్కారం లభించేనా?
- పటిష్టమైన భద్రత నడుమ పాకిస్తాన్ రాజధాని
- ట్రాఫిక్ ఆంక్షలు.. పాఠశాలలు, మార్కెట్లు మూసివేత
- లెబనాన్‌పై ఆగని ఇజ్రాయిల్ యుద్ధోన్మాదం
- తాజా వైమానిక దాడుల్లో ఆరుగురు మృతి
- ఈ దాడుల నేపథ్యంలో పాక్‌కు బయలుదేరని ఇరాన్ బృందం!
- హంగేరీ నుంచి ఇస్లామాబాద్‌కు అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి వాన్స్ బృందం

2లో

### నియోజకవర్గాల పెంపుపై మొండిగా వెళ్తే..
## ప్రజా ఉద్యమం తప్పదు



- కేంద్రాన్ని హెచ్చరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- ఉత్తర, దక్షిణాది రాష్ట్రాల మధ్య సమతౌల్యం పాటించాలని సూచన
- రాష్ట్రాల జీడీపీ ఆధారంగా సీట్లు ఇవ్వాలని డిమాండ్
- సీనియర్లను గౌరవించిన చరిత్ర భారాసకు లేదని మండిపాటు

2లో

### యూపీ బోటు ప్రమాదం
## ప్రధాని సంతాపం

- మధురలోని యమునా నదిలో పడవ బోల్తా
- ప్రమాదంలో 10 మంది యాత్రికులు మృతి
- 14 మందిని కాపాడిన సహాయక బృందాలు
- గల్లంతైన వారి కోసం కొనసాగుతున్న గాలింపు చర్యలు
- ప్రమాదంపై ప్రధాని, యూపీ సీఎం దిగ్భ్రాంతి

2లో





### సికింద్రాబాద్‌విశాఖ వందే భారత్
## విజయకేతనం: దక్షిణాదిలోనే టాప్!

- 2025-26 ఆర్థిక సంవత్సరంలో వందే భారత్ రైళ్లలో 4 కోట్ల మంది ప్రయాణం
- గతేడాది కంటే 34 శాతం పెరిగిన ప్రయాణికుల సంఖ్య
- సికింద్రాబాద్-విశాఖపట్నం మార్గంలో 48 లక్షల మంది ప్రయాణం
- కొత్తగా ప్రారంభమైన వందే భారత్ స్లీపర్ సర్వీసులకు ఫుల్ డిమాండ్

2లో

### రాజ్యసభకు నితీశ్ కుమార్..
## ఎంపీగా ప్రమాణస్వీకారం!

- రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణస్వీకారం చేసిన నితీశ్ కుమార్
- త్వరలో ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేస్తానని వెల్లడి
- నాలుగు చట్టసభల్లో పనిచేసిన నేతగా అరుదైన రికార్డు
- ఇటీవల ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసిన నితీశ్
- ఇకపై ఢిల్లీలోనే ఉండి పనిచేస్తానని స్పష్టీకరణ

2లో



# 20న బీఆర్ఎస్‌లోకి జీవన్‌రెడ్డి

మర్కుక్ : మాజీమంత్రి టి జీవన్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీలో చేరడానికి ముహూర్తం ఖరారైంది. ఈనెల 20న ఆయన గులాబీ తీర్థం పుచ్చుకోనున్నారు. అదేరోజు జగిత్యాలలో భారీ బహిరంగ సభను నిర్వహించాలని బీఆర్ఎస్ పార్టీ భావిస్తున్నది. శుక్రవారం హైదరాబాద్ ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను జీవన్‌రెడ్డి కలిశారు. దశాబ్దాల రాజకీయ ప్రస్థానంలో ఉన్న ఈ ఇద్దరు నేతలు, తాజా పరిణామాల నేపథ్యంలో అత్యంత ఆత్మీయంగా కలుసుకున్నారు. వ్యవసాయ క్షేత్రానికి చేరుకున్న జీవన్‌రెడ్డిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి ఎంతో భావోద్వేగానికి లోనయ్యారు. కేసీఆర్‌ను ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు. ఈనెల 20న జగిత్యాలలో జరిగే బహిరంగ సభకు ముఖ్య అతిథిగా రావాల్సిందిగా కేసీఆర్‌ను జీవన్ రెడ్డి ఆహ్వానించారు. 'మీతో కలిసి పనిచేయాలని ఆ దేవుడే తనను పంపాడు.. తిరోగమనంలో ఉన్న కాంగ్రెస్‌పై యుద్ధం చేయాలి' అంటూ ఎమోషన్ అయినట్టు సమాచారం. కాగా కొద్ది రోజులుగా కాంగ్రెస్ పార్టీలో జరుగుతున్న పరిణామాలపై అసంతృప్తితో ఉన్న ఆయన ఇటీవల ఆ పార్టీకి రాజీనామా చేశారు. ఆ తర్వాత బీఆర్ఎస్‌లో చేరాలని నిర్ణయించుకున్నారు. కేటీఆర్ ఆయనతో చర్చలు జరిపారు. గురువారం స్వయంగా జగిత్యాలకు వెళ్లి భేటీ అయ్యారు. ఈ క్రమంలో జీవన్‌రెడ్డి కేసీఆర్‌ను కలిశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు గంగుల కమాలకర్, కొప్పుల ఈశ్వర్, వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎల్.రమణ, బీఆర్ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షులు కె.విద్యాసాగర్‌రావు, మాజీ కార్పొరేషన్ చైర్మెన్ గ్యాదరి బాలమల్లు, మాజీ జిల్లా చైర్మెన్ వసంత తదితరులున్నారు.

# అందరి చూపు ఇస్లామాబాద్ వైపు

ఇస్లామాబాద్ : మధ్యప్రాచ్యంలో యుద్ధ పరిస్థితులు యావత్ ప్రపంచాన్ని అనిశ్చితిలోకి నెట్టేశాయి. అమెరికాఇజ్రాయిల్ యుద్ధోన్మాదంతో ప్రపంచ దేశాలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నాయి. ఇంధన కొరతతో అల్లాడి పోయాయి. వ్యాపార, వాణిజ్య మార్కెట్లపై తీవ్ర ప్రభావం పడింది. ఇరాన్‌పై అమెరికా ఇజ్రాయిల్ సంయుక్త దాడులు జరపడం, అదే స్థాయిలో ఇరాన్ నుంచి ప్రతిదాడులు ఎదురు కావడంతో యుద్ధం నలభై రోజులకుపైగానే కొనసాగింది. యుద్ధం విరమించాలంటూ పలు ప్రపంచ దేశాలు విజ్ఞప్తులు చేస్తున్నా ఎలాంటి ఫలితం కనబడలేదు. చివరకు పాకిస్తాన్ అభ్యర్థన మేరకు రెండు వారాల పాటు తాత్కాలిక కాల్పుల విరమణ ఉంటుందని ఇటీవలే అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వెల్లడించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పాకిస్తాన్ రాజధాని ఇస్లామాబాద్ కేంద్రంగా అమెరికా ఇరాన్ ప్రతినిధుల మధ్య కీలక చర్చలు జరగనున్నాయి. దీంతో రాజధాని నగరంలో పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేశారు. అయితే ఈ చర్చల్లో యుద్ధం ముగింపునకు సంబంధించి ఏదైనా పరిష్కారం లభిస్తుందా? అని ప్రపంచ దేశాలు ఆసక్తితో ఎదురు చూస్తున్నాయి.

**సాధారణ వాహనాలకు నో ఎంట్రీ**

పార్లమెంట్, కీలక ప్రభుత్వ కార్యాలయాలు, లగ్జరీ హౌటళ్లు, ఎంబసీలు, విదేశీ సంస్థల కార్యాలయాలు ఉన్న రెడ్ జోన్ ప్రాంతంలోని రహదారులు సాధారణ వాహనాలను పూర్తిగా మూసివేశారు. పోలీసు బలగాలు నగరవ్యాప్తంగా చెక్‌పోస్టులు ఏర్పాటు చేశాయి. అధికార ప్రతినిధుల రాకపోకలకు ఆటంకం లేకుండా ట్రాఫిక్ మళ్లింపులు అమలు చేస్తున్నారు. ఈ కీలక చర్చల ముందు ప్రజల రాకపోకలు తగ్గించేందుకు గురువారం, శుక్రవారం రోజులను ప్రభుత్వ సెలవులుగా ప్రకటించారు. పాఠశాలలు, దుకాణాలు మూతబడ్డాయి. కొన్ని చోట్ల మాత్రమే పరిమిత కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. అమెరికా, ఇజ్రాయిల్ సంయుక్త దాడుల్లో ఫిబ్రవరి 28న ఇరాన్ సుప్రీం లీడర్ అలీ ఖమేనీ హత్యకు గురైన తర్వాత మధ్యప్రాచ్యంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న విషయం విదితమే. అది అమెరికాఇజ్రాయిల్, ఇరాన్‌ల మధ్య యుద్ధానికి దారి తీసింది. అయితే పాక్ అభ్యర్థన మేరకు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కొన్ని రోజుల కిందట రెండు వారాల పాటు తాత్కాలిక కాల్పుల విరమణను ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో అమెరికాఇజ్రాయిల్, ఇరాన్‌ల మధ్య యుద్ధానికి తాత్కాలికంగా తెరపడింది. పాక్ అభ్యర్థనతో తాత్కాలిక ఒప్పం దానికి దారులు ఏర్పడ్డాయి. ఇది అమెరికా, ఇరాన్ దేశాల మధ్య చర్చలకు అవకాశం కల్పించింది. దీంతో మరింత ఘర్షణను నివారించడమే లక్ష్యంగా ఈ చర్చలు జరుగుతున్నాయి.

**ఆంక్షల నడుమ ఇస్లామాబాద్**

మధ్యప్రాచ్యంలో సున్నితమైన కాల్పుల విరమణ కొనసాగుతున్న నేపథ్యంలో నేడు అమెరికాఇరాన్ మధ్య చర్చలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో అందరి దృష్టి ఇస్లామాబాద్‌పై నిలిచింది. పాకిస్తాన్ రాజధానిలో ఇప్పటికే కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు జరిగాయి. పోలీసులు, మిలిటరీ, స్పెషల్ సర్వీస్ కమాండోల ఆధీనంలోకి నగరం వెళ్లింది. ముఖ్య రహదారులు, ప్రభుత్వ భవనాల వద్ద భద్రతా దళాలు గస్తీ కాస్తున్నాయి. నగరంలోని రెడ్ జోన్ ప్రాంతం కఠిన భద్రత కింద ఉంది. అక్కడ సాధారణ ప్రజల రాకపోకలు చాలా పరిమితంగా అనుమతిస్తున్నారు.

**భద్రతపై హామీ**

పాకిస్తాన్ అంతర్గత వ్యవహారాల మంత్రి మోహిసిన్ నక్వీ.. అమెరికా రాయబారికి పూర్తి భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే 30 మంది సభ్యులతో కూడిన అమెరికా బృందం ఇస్లామాబాద్‌కు చేరుకుని భద్రతా ఏర్పాట్లను పరిశీలించింది. అయితే ఈ కీలక సమావేశాన్ని నిర్వహించే హౌటల్ సెరీనా వద్ద భద్రతపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ హౌటల్ సాధారణంగా ఉన్నతస్థాయి దౌత్య సమావేశాలకు వేదికగా ఉపయోగిస్తారు. కాగా వైట్ హౌజ్ మాజీ ప్రెస్ సెక్రెటరీ ఎరీ ఫ్లీషెర్ ఈ విషయంపై ఆందోళన వ్యక్తం చేశారు. పాకిస్తాన్‌లో భద్రతా పరిస్థితి పూర్తిగా ప్రభుత్వ నియంత్రణలో లేదని వ్యాఖ్యానించారు.

**గగనతల భద్రత కట్టుదిట్టం**

చర్చల నేపథ్యంలో గగనతల భద్రతను కూడా కట్టుదిట్టం చేశారు. పాకిస్తాన్ ఎయిర్‌ఫోర్స్ 1ఎల్78 ట్యాంకర్లు, సీ130 విమానాలను మోహరించింది. ఇరాన్‌లోని బందర్ అబ్బాస్ ప్రాంతం మీదుగా పాకిస్తాన్ యుద్ధ విమానాలు గస్తీ కాస్తున్నాయి. ఇవి ఇరాన్ ప్రతినిధి బృందం ప్రయాణించే విమానానికి భద్రత కల్పిస్తున్నాయి. అలాగే ఏడబ్ల్యూఏసీఎస్ వ్యవస్థను కూడా వినియోగిస్తున్నారు. ఇది మొత్తం విమాన రంగాన్ని పర్యవేక్షిస్తూ "రక్షణ కవచం"లా పని చేస్తుంది. ఇజ్రాయిల్ దాడులను నివారించడమే దీని లక్ష్యం.

**ఇరాన్‌కు మరో మార్గం లేదు: ట్రంప్**


అంతర్జాతీయ జలమార్గాలను ఉపయోగించి ప్రపంచాన్ని కొన్ని రోజులు దోపిడీ చేయడం తప్ప ఇరాన్ నేతలకు మరో మార్గం లేదన్నారు. కేవలం చర్చలు జరపడానికి మాత్రమే వారు సజీవంగా ఉన్నారంటూ ట్రూత్ సోషల్‌లో పోస్టు చేశారు. అమెరికాఇరాన్ మధ్య మరికొద్ది గంటల్లోనే శాంతి చర్చలు జరగనున్న వేళ ట్రంప్ ఈ తరహాలో స్పందించడం గమనార్హం.

*** 'హోర్ముజ్' ఫీజు చెల్లింపులు ఇరాన్ కరెన్సీలోనే.. : ఇరాన్ ప్రతిపాదన**

ప్రపంచంలోనే అత్యంత కీలకమైన చమురు రవాణా మార్గాల్లో ఒకటైన హోర్ముజ్ జలసంధి గుండా ప్రయాణించే నౌకలు చెల్లించే ట్రాన్సిట్ ఫీజులను ఇకపై ఇరాన్ కరెన్సీ 'రియాల్'లో చెల్లించా లనే ప్రతిపాదనను ఇరాన్ ముందుకు తెచ్చింది. ఇరాన్ పార్లమెంట్ జాతీయ భద్రతా కమిషన్ అధిపతి ప్రకారం... హోర్ముజ్ జలసంధి గుండా ప్రయాణించే నౌకల నుంచి వసూలు చేసే రవాణా రుసుములను రియాల్‌లో చెల్లించేలా పార్లమెంట్‌లో ఒక ప్రతిపాదన తీసుకొచ్చారు. ఈ విషయాన్ని ముంబయిలోని ఇరాన్ కాన్సులేట్ జనరల్ సోషల్ మీడియా వేదిక 'ఎక్స్' ద్వారా వెల్లడించింది. కాగా అమెరికా డాలర్ ప్రపంచ ఆధిపత్యాన్ని తగ్గించేందుకు ఇరాన్, చైనా కలిసి మార్గాలు అన్వేషిస్తున్నాయని విశ్లేషకులు చెప్తున్నారు.

# చర్చల కోసం పాకిస్థాన్ బయల్దేరిన అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్.. ఇరాన్‌కు వార్నింగ్

వాషింగ్టన్/ఇస్లామాబాద్, ఏప్రిల్ 10 : అమెరికా, ఇరాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతల నడుమ చర్చల ప్రక్రియకు మార్గం సుగమమవుతోంది. ఇరాన్‌తో చర్చలు జరిపేందుకు అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ శుక్రవారం పాకిస్థాన్‌కు బయల్దేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇరాన్ నిజాయతీతో చర్చలకు వస్తే స్నేహ హస్తం అందించడానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, కానీ మోసపూరితంగా వ్యవహరించాలని చూస్తే మాత్రం తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. ఇస్లామాబాద్‌కు బయల్దేరే ముందు జాయింట్ బేస్ ఆండ్రూస్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. "చర్చల కోసం మేం ఎదురుచూస్తున్నాం. ఇవి సానుకూలంగా జరుగుతాయని ఆశిస్తున్నాను. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పినట్లుగా, ఇరాన్ నిజాయతీతో చర్చలకు వస్తే మేం తప్పకుండా స్నేహ హస్తం అందిస్తాం. అదే సమయంలో,



మాతో ఆటలాడాలని చూస్తే మా చర్చల బృందం అంత సుముఖంగా ఉండబోదని వాళ్లు తెలుసుకోవాలి" అని వాన్స్ స్పష్టం చేశారు. అధ్యక్షుడు ట్రంప్ నిర్దేశించిన స్పష్టమైన మార్గదర్శకాలతోనే తాము చర్చలకు వెళ్తున్నామని ఆయన తెలిపారు. ప్రస్తుతం అమెరికా, ఇరాన్ మధ్య రెండు వారాల కాల్పుల విరమణ అమల్లో ఉంది. ఈ నేపథ్యంలో జరుగుతున్న ఈ చర్చలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. అయితే, వాన్స్ పర్యటనకు సంబంధించిన పూర్తి షెడ్యూల్‌ను అధికారులు ఇంకా విడుదల చేయలేదు. గల్ఫ్ ప్రాంతంలో స్థిరత్వం, ఇంధన సరఫరా వంటి అంశాల కారణంగా ఈ పరిణామాలను భారత్ నిశితంగా గమనిస్తోంది.

# నియోజకవర్గాల పెంపుపై మొండిగా వెళ్తే.. ప్రజా ఉద్యమం తప్పదు

దిల్లీ: దేశవ్యాప్తంగా లోక్‌సభ స్థానాలను 50% పెంచాలన్న కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదనను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్రంగా వ్యతిరేకించారు. దానివల్ల రాష్ట్రాల మధ్య అంతరం పెరిగి సమతౌల్యం దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రం మొండిగా ముందుకెళ్తే ప్రజా ఉద్యమం వస్తుందని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం తాను పట్టిన కుందేలుకు మూడే కాళ్లు అన్నట్లు మూడు సాగుచట్టాలు చేసినా రైతుల ఆందోళన కారణంగా వెనక్కు తీసుకోవాల్సి వచ్చిందని గుర్తుచేశారు. ఇప్పుడు నియోజకవర్గాల పెంపు విషయంలోనూ అదే పరిస్థితిని ఎదుర్కోక తప్పదన్నారు. శుక్రవారం దిల్లీలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో పాల్గొనడానికి వచ్చిన సీఎం.. ఇక్కడి తన నివాసంలో విలేకర్లతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. పలు ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే.. "గతంలో వాజ్‌పేయి ప్రభుత్వం ఒక్క ఓటుతో ఓడిపోయింది. భవిష్యత్తులో అలాంటి పరిస్థితి రాకుండా చూసుకోవడానికి భాజపా.. ఉత్తరాది రాష్ట్రాల బలం పెంచే పనిలో ఉంది. కేంద్ర ప్రభుత్వం అన్ని పక్షాలతో చర్చించి అభిప్రాయాలు స్వీకరించకుండా మొండిగా ముందుకెళ్తే ప్రజా ఉద్యమం వస్తుంది. ప్రస్తుతం విద్య, ఉద్యోగ నియమకాలు 50% మెరిట్, 50% రిజర్వేషన్ల ప్రాతిపదికగా జరుగుతున్నాయి. సీట్ల పెంపు కూడా అలా ఆర్థిక, సామాజిక, రాజకీయ కోణాల్లో జరగాలి. కాదని గుడ్డిగా పెంచితే పెద్దరాష్ట్రాలు పెద్దగా, చిన్న రాష్ట్రాలు మరింత చిన్నవిగా అయిపోతాయి. వివక్ష మరింత పెరిగిపోతుంది. ఇది కేవలం దక్షిణాది రాష్ట్రాల సమస్య మాత్రమే కాదు. ఉత్తరాదిలోనూ పంజాబ్, హరియాణా, ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్ లాంటి రాష్ట్రాలూ నష్టపోతాయి. అవి కూడా ఈ పెంపును ఒప్పుకొనే పరిస్థితి ఉండదు. ఇవేవీ పట్టించుకోకుండా ముందుకెళ్తే ప్రజాగ్రహానికి గురికాక తప్పదు. ఆర్థిక వనరుల పంపకాల్లో ఉత్తర, దక్షిణాదిల మధ్య అంతరాన్ని ఇప్పుడు రాజకీయంగానూ తీసుకురావడానికి భాజపా ప్రయత్నిస్తోంది. కేంద్ర పన్నుల్లో దక్షిణాది రాష్ట్రాలన్నింటికీ కలిపి పంచే మొత్తం కంటే ఒక్క ఉత్తర్‌ప్రదేశ్‌కి పంచే మొత్తమే అధికం. సీట్లు పెంచితే ఆ రాష్ట్రం రాజకీయంగానూ మరింత బలోపేతమవుతుంది. దేశానికి వెన్నెముకగా ఉన్న దక్షిణ, పశ్చిమ రాష్ట్రాలు, 40% ఆర్థిక వనరులు అందిస్తున్న దక్షిణాది రాష్ట్రాలకు కనీసం 40% సీట్లయినా కేటాయించాలి. మోదీ అధికారంలోకి వచ్చిన గత 12 ఏళ్ల నుంచి రాజకీయంగా దక్షిణాదికి ప్రాధాన్యం లభించడంలేదు. ఇదివరకు కేంద్రంలోని టాప్ 10 మంత్రి పదవుల్లో కనీసం నాలుగు దక్షిణాదికి ఇచ్చేవారు. కానీ ఇప్పుడు ఎన్ని ప్రాధాన్య పదవులు ఇచ్చారో చెప్పమనండి. భాజపా ఎప్పుడూ దక్షిణాది రాష్ట్రాల అభివృద్ధి కోరుకోదు. ద్రవిడ, ఆర్య సంస్కృతుల మధ్య తేడాను అలాగే కొనసాగించాలని చూస్తుంది.

# కాంగ్రెస్ నేత పవన్ ఖేరాకు తెలంగాణ హైకోర్టులో భారీ ఊరట

హైదరాబాద్, ఏప్రిల్ 10: కాంగ్రెస్ సీనియర్ నేత పవన్ ఖేరాకు తెలంగాణ హైకోర్టులో భారీ ఊరట లభించింది. అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మ భార్య రినికి భూయాన్ శర్మపై పరువు నష్టం కలిగించే ఆరోపణలు చేశారన్న కేసులో ఆయనకు వారం రోజుల పాటు మధ్యంతర ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. అస్సాంలోని సంబంధిత కోర్టులో రెగ్యులర్ బెయిల్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు వీలుగా ఈ వెసులుబాటు కల్పించింది. గురువారం ఇరుపక్షాల వాదనలు విన్న జస్టిస్ కె. సుజన, తీర్పును రిజర్వ్ చేసి శుక్రవారం వెలువరించారు. అస్సాం వెళ్లేందుకు వీలుగా తనకు ట్రాన్సిట్ యాంటిసిపేటరీ బెయిల్ మంజూరు చేయాలని పవన్ ఖేరా హైకోర్టును ఆశ్రయించారు. ఖేరా తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపించారు. ఇది పూర్తిగా రాజకీయ కక్ష సాధింపు చర్య అని, రాజకీయ ప్రత్యర్థిపై ఒత్తిడి తెచ్చేందుకే అస్సాం పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారని ఆరోపించారు. ఖేరా ఆరోపణలు తప్పని తేలినా, ఇది పరువు నష్టం కేసు కిందకే వస్తుందని, అరెస్టు చేయాల్సిన అవసరం లేదని వాదించారు. తాను హైదరాబాద్‌లో ఉన్న సమయంలో ఎఫ్ఐఆర్ గురించి తెలియడంతోనే కోర్టును ఆశ్రయించారని, విచారణకు సహకరించేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అస్సాం పోలీసుల తరఫున అడ్వకేట్ జనరల్ దేవాజిత్ సైకియా వాదిస్తూ, హైదరాబాద్‌లో ఈ పిటిషన్ విచారణార్హం కాదని అభ్యంతరం తెలిపారు. ఢిల్లీ నివాసి అయిన ఖేరా, అస్సాంలో ఎందుకు పిటిషన్ వేయలేదో సరైన కారణం చూపలేదని పేర్కొన్నారు.

**కేసు నేపథ్యం**

అస్సాం సీఎం భార్య రినికి భూయాన్ శర్మకు బహుళ విదేశీ పాస్‌పోర్టులు, దుబాయ్‌లో అప్రకటిత ఆస్తులు, అమెరికాలో షెల్ కంపెనీలు ఉన్నాయని పవన్ ఖేరా ఇటీవల ఓ ప్రెస్ మీట్‌లో సంచలన ఆరోపణలు చేశారు. దీనిపై అస్సాం పోలీసులు ఆయనపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) కింద ఫోర్జరీ, పరువు నష్టం, నేరపూరిత కుట్ర వంటి 14 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో పోలీసులు ఢిల్లీలోని ఆయన నివాసానికి వెళ్లగా, ఆయన అక్కడ లేరు. హైదరాబాద్‌లోని ఆయన భార్య ఇంటి వద్ద కూడా భద్రతను ఏర్పాటు చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో తనపై పెట్టిన ఆరోపణలకు సమాధానం చెప్పకుండా సీఎం పోలీసులను అడ్డం పెట్టుకుంటున్నారని, తాను ఇలాంటి బెదిరింపులకు భయపడబోనని ఖేరా ఓ వీడియో ప్రకటన విడుదల చేశారు.

# తాటాకు చప్పుళ్లకు బెదరం: పొంగులేటి కౌంటర్

ఖమ్మం, ఏప్రిల్ 10: తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీపై నిప్పులు చెరిగారు. రాజకీయ విమర్శల విషయంలో మంత్రి పొంగులేటి మరింత ఘాటుగా స్పందిస్తూ, తమకు అంటిన బురదను అధికార పార్టీ నేతలకు అంటించాలని కొంతమంది ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. ఎవరు ఎన్ని అవాకులు చవాకులు పేలినా, కారుకూతలు కూసినా ఈ ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తుందని, ప్రతిపక్షాల తాటాకు చప్పుళ్లకు తాము బెదిరే ప్రసక్తే లేదని హెచ్చరించారు. భవిష్యత్తులో కూడా ఇందిరమ్మ రాజ్యాన్ని ప్రజలు దీవించడానికి సిద్ధంగా ఉన్నారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం చేగొమ్మలో నూతనంగా నిర్మించిన గోదాము ప్రారంభోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, ధాన్యం సేకరించిన వారం రోజుల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని స్పష్టం చేశారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా రైతు భరోసా కింద ప్రతి ఎకరానికి రూ. 12,000 అందిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్ వల్ల రైతులు ఎదుర్కొన్న ఇబ్బందులను తొలగించేందుకు దానిని బంగాళాఖాతంలో కలిపి, పారదర్శకమైన 'భూ భారతి' విధానాన్ని తీసుకొచ్చామని ఆయన పేర్కొన్నారు. దీని ద్వారా ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా మూడు లక్షల ఎనభై వేల మంది రైతులకు కొత్త పాస్ పుస్తకాలు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. సన్న వడ్లకు మద్దతు ధరతో పాటు అదనంగా ఐదు వందల రూపాయల బోనస్ ఇస్తున్నామని, పండించిన సన్న బియ్యాన్ని ఇతర ప్రాంతాలకు తరలించకుండా రేషన్ ద్వారా రాష్ట్రంలోని పేదలకు అందిస్తున్నామని మంత్రి వివరించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం కలెక్టర్ దురిశెట్టి అనుదీప్, సీపీ సునీల్ దత్ మరియు పలువురు కార్పొరేషన్ చైర్మన్లు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# యూపీ బోటు ప్రమాదం: ప్రధాని సంతాపం

మధుర (ఉత్తరప్రదేశ్), ఏప్రిల్ 10: ఉత్తరప్రదేశ్‌లోని మధుర జిల్లాలో ఘోర పడవ ప్రమాదం జరిగింది. బృందావన్‌లోని కేశీఘాట్ వద్ద యమునా నదిలో యాత్రికులతో వెళుతున్న పడవ బోల్తా పడటంతో 10 మంది మృతి చెందారు. మరో 14 మందిని సహాయక బృందాలు సురక్షితంగా కాపాడాయి. గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. వివరాల్లోకి వెళితే, పంజాబ్‌కు చెందిన సుమారు 30 మంది యాత్రికులు శుక్రవారం మధ్యాహ్నం పడవలో యమునా నదిలో ప్రయాణిస్తున్నారు. ఈ క్రమంలో పడవ అదుపుతప్పి నదిపై ఉన్న ఫ్లోటింగ్ పాంటూన్ వంతెన (పైపా బ్రిడ్జి)ను ఢీకొట్టింది. దీంతో పడవ ఒక్కసారిగా నీటిలో మునిగిపోయింది. సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించడం వల్లే ఈ దుర్ఘటన జరిగిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ప్రమాద సమాచారం అందిన వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, స్థానిక గజ ఈతగాళ్లు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఇప్పటివరకు 14 మందిని కాపాడి ఆసుపత్రికి తరలించగా, 10 మృతదేహాలను వెలికితీశారు. గల్లంతైన వారి కోసం ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు యమునా నదిలో తీవ్రంగా గాలిస్తున్నాయి. ఈ దుర్ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ, యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సహాయక చర్యలను వేగవంతం చేయాలని, బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని సీఎం యోగి అధికారులను ఆదేశించారు. స్థానిక యంత్రాంగం బాధితులకు అన్ని విధాలా అండగా నిలుస్తోందని ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతుండటంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# సికింద్రాబాద్-విశాఖ వందే భారత్ విజయకేతనం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 10: వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ప్రయాణికుల నుంచి అద్భుతమైన స్పందన లభిస్తోంది. 202526 ఆర్థిక సంవత్సరంలో ఏకంగా 3.98 కోట్ల మంది ఈ సెమీ హైస్పీడ్ రైళ్లలో ప్రయాణించారు. అంతకుముందు ఏడాదితో (2.97 కోట్లు) పోలిస్తే ఇది 34 శాతం అధికమని రైల్వే మంత్రిత్వ శాఖ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. 2019 ఫిబ్రవరిలో న్యూఢిల్లీ వారణాసి మార్గంలో తొలిసారిగా ప్రారంభమైన వందే భారత్ సేవలు, ఇప్పుడు దేశవ్యాప్తంగా విస్తరించాయి. ఇప్పటివరకు లక్షకు పైగా ట్రిప్పుల ద్వారా మొత్తం 9.1 కోట్ల మందికి పైగా ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చాయి. 'మేక్ ఇన్ ఇండియా'లో భాగంగా దేశీయంగా తయారైన ఈ రైళ్లు వేగం, సామర్థ్యం, స్వావలంబనకు ప్రతీకగా నిలుస్తున్నాయని రైల్వే శాఖ పేర్కొంది. దేశంలోని వివిధ మార్గాల్లో న్యూఢిల్లీవారణాసి కారిడార్ అత్యంత రద్దీగా ఉంది. ఈ మార్గంలో ఇప్పటివరకు 73 లక్షల మంది ప్రయాణించారు. ఇక న్యూఢిల్లీశ్రీ మాతా వైష్ణోదేవి కాట్రా మార్గంలో 56 లక్షల మంది ప్రయాణించడం ద్వారా ఆధ్యాత్మిక పర్యాటకానికి ఈ రైళ్లు ఎంతగానో దోహదపడుతున్నాయని స్పష్టమవుతోంది. దక్షిణ భారతదేశంలో, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల మధ్య నడిచే సికింద్రాబాద్ విశాఖపట్నం మార్గంలో 48 లక్షల మంది ప్రయాణించారు. చెన్నైమైసూరు మార్గంలో 36 లక్షల మంది రాకపోకలు సాగించారు.

# పిల్లలలో పుట్టుకతో వచ్చే లోపాలను గుర్తించి తక్షణమే వైద్య చికిత్స అందించాలి

*** జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. రవి రాథోడ్**

మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి: పిల్లలలో పుట్టుకతో వచ్చే లోపాలను గుర్తించి తక్షణమే వైద్య చికిత్స అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. రవి రాథోడ్ అన్నారు. శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమం, జిల్లా ఏర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ కార్యక్రమాలపై సమీక్ష సమావేశం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. రవి రాథోడ్ అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా డా. రవి రాథోడ్ మాట్లాడుతూ, ఆర్‌బీఎస్‌కే కార్యక్రమం ద్వారా పిల్లలలో పుట్టుకతో వచ్చే లోపాలు, వ్యాధులు, పోషకాహార లోపాలు,



అభివృద్ధి ఆలస్యం ను తొందరగా గుర్తించి, తక్షణ చికిత్స అందించడం అత్యంత ముఖ్యమని తెలిపారు. ఎర్లీ ఇంటర్ వెన్షన్ కేంద్రాల ద్వారా గుర్తించిన పిల్లలకు సమగ్ర వైద్య సేవలు, థెరపీ సేవలు సమయానికి అందించాలన్నారు. జిల్లాలోని అన్ని ఆర్‌బీఎస్‌కే టీమ్స్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను సమర్థవంతంగా సందర్శించి, పిల్లల ఆరోగ్య పరీక్షలు క్రమం తప్పకుండా నిర్వహించాలని, గుర్తించిన కేసులను వెంటనే ఎర్లీ ఇంటర్ వెన్షన్ కేంద్రాలకు రిఫర్ చేయాలని ఆదేశించారు. సమన్వయంతో పని చేసి జిల్లాలో బాలల ఆరోగ్య సూచికలను మెరుగుపరచాలని డిఎంహెచ్ఓ సూచించారు.ఈ సమావేశంలో ప్రోగ్రాం అధికారి డా. లక్ష్మీనారాయణ, డిప్యూటీ మాస్ మీడియా అధికారి కొప్పు ప్రసాద్, హెల్త్ ఎడ్యుకేటర్ కె.వి. రాజు, హెచ్ఈఓ కేవీఎస్ స్వామి, ఆర్‌బీఎస్‌కే వైద్యులు, ఫార్మసిస్టులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## హెల్మెట్ వినియోగంపై ఆర్సీ పురం ట్రాఫిక్ పోలీసుల అవగాహన



ప్రజాస్ఫూర్తి, శేరిలింగంపల్లి : రోడ్డు భద్రతపై ప్రజల్లో చైతన్యం పెంపొందించేందుకు ఆర్సీ పురం ట్రాఫిక్ పోలీసులు మంజీరా పైప్‌లైన్ రోడ్ వద్ద హెల్మెట్ వినియోగంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాల్సిన అవసరాన్ని అధికారులు వివరించారు. సందర్భంగా ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ఆర్. విద్యాసాగర్ రెడ్డి మాట్లాడుతూ, రోడ్డు భద్రతకు హెల్మెట్ కీలక పాత్ర పోషిస్తుందని, ప్రతి వాహనదారుడు స్వచ్ఛందంగా భద్రతా నియమాలు పాటించాలని సూచించారు. ప్రమాదాల సమయంలో హెల్మెట్ వినియోగం ద్వారా గాయాలు, మరణాలను గణనీయంగా తగ్గించుకోవచ్చని ప్రజలకు తెలియజేశారు. అలాగే ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు రాములు, మల్లన్న , ఏఎస్ఐ మల్లేష్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ కార్మికుల న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలి



హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : తెలంగాణ విద్యుత్ కార్మికుల తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం గాని విద్యుత్ అధికారులు గాని పట్టించుకోకపోవడం బాధాకరమని బిఆర్ఎస్ హుస్నాబాద్ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అనేక సంవత్సరాలుగా విద్యుత్ సంస్థ లో ఉద్యోగ భద్రత లేకుండా పని చేస్తున్నారని, కనీస వేతనాలు అందడం లేదన్నారు. ఆర్టిజన్ కార్మికులకు అర్హత బట్టి ఉద్యోగ మార్పులు హోదా కల్పించాలి కానీ విద్యుత్ సంస్థ పట్టించుకోవడం లేదని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడిచిన విద్యుత్ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలం అయిందని ఆరోపించారు. విద్యుత్ కార్మికులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేసే విధంగా చర్చల పిలువాలని బి ఆర్ యస్ పార్టీ డిమాండ్ చేస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ కార్మికులు, బి ఆర్ఎస్ పార్టీ నాయకులు బొజ్జ హరీష్, యాస శ్రీనివాస్, కందుకూరి సతీష్, గొపగోని అరవింద్ గౌడ్ పాల్గొన్నారు.

## క్యాంటీన్‌లో మిల్లెట్స్ వంటకాలు అందుబాటులోకి తేవాలి

**– కలెక్టర్ అంకిత్**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: సిరిధాన్యాల (మిల్లెట్స్) వంటకాల ప్రోత్సాహానికి ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. శుక్రవారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహిస్తున్న ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్యాంటీన్‌లో అందుబాటులో ఉన్న ఆహార పదార్థాలను పరిశీలించిన కలెక్టర్, ఉద్యోగులు, ప్రజలకు నాణ్యమైన, శుభ్రమైన ఆహారం అందించాలని ఆదేశించారు. ముఖ్యంగా మిల్లెట్స్‌తో తయారుచేసిన ఇడ్లీ, దోశ వంటి ఆరోగ్యకర వంటకాలను అందుబాటులోకి తేవాలని సూచించారు.క్యాంటీన్ నిర్వహణపై వివరాలు తెలుసుకుని, నాణ్యమైన, తాజా ఆహార పదార్థాలనే విక్రయించాలని, శుభ్రత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని నిర్వాహకులకు ఆదేశించారు.ఈ సందర్భంగా మంత్రి ధనసరి అనసూయ పర్యటనలో భాగంగా ఏర్పాటు చేసిన మహిళా శిశు సంక్షేమ శాఖ స్టాళ్లను సందర్శించి, మహిళా సంఘాల తయారు చేసిన ఆహార పదార్థాలను రుచి చూశారు. మహిళల స్వయం ఉపాధికి ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విద్యా చందన, అధికారి స్వర్ణలత లెనినా తదితరులు పాల్గొన్నారు.

## తప్పిపోయిన నాలుగేళ్ళ చిన్నారిని క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగింత




ప్రజాస్ఫూర్తి , పటాన్ చెరు : తప్పిపోయిన నాలుగేళ్ళ చిన్నారిని అత్యంత వేగంగా స్పందించి గంటల వ్యవధిలోనే పటాన్‌చెరు పోలీసులు తల్లి ఒడికి చేర్చారు. శుక్రవారం ఉదయం సుమారు 10:30 గంటల సమయంలో, పటాన్‌చెరు బస్టాండ్ ఆవరణలో 4 సంవత్సరాల వయసున్న ఒక చిన్నారి తన తల్లిదండ్రులు లేక ఒంటరిగా తిరుగుతూ ఏడుస్తుండటాన్ని గమనించిన స్థానికులు, వెంటనే ఆ పాపను పటాన్‌చెరు పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు.పాప వివరాలను సేకరించే క్రమంలో పటాన్‌చెరు పిఎస్ కానిస్టేబుల్ మహేందర్ యాదవ్ ఐటీ కోర్ కానిస్టేబుల్ రవిలు చాకచక్యంగా వ్యవహరించారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో ఆరా తీయగా, ఆ చిన్నారి కజిపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్తున్నట్లు సమాచారం లభించింది. ఈ ఆధారంతో వెంటనే పాప తల్లిదండ్రులను గుర్తించి వారికి సమాచారం అందించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న పాప తల్లి అనితకు, చిన్నారిని పోలీసులు క్షేమంగా అప్పగించారు. సకాలంలో స్పందించి చిన్నారి ఆచూకీ కనుగొన్న కానిస్టేబుల్ మహేందర్ యాదవ్ , ఐటీ కోర్ కానిస్టేబుల్ రవిలను పటాన్‌చెరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వినాయక రెడ్డి ప్రత్యేకంగా అభినందించి, వారి పనితీరును మెచ్చుకున్నారు. తమ బిడ్డను క్షేమంగా అప్పగించినందుకు పాప తల్లిదండ్రులు పోలీసులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

## యోగా తోనే ఆరోగ్య రక్షణ

*** మంత్రి దామోదర్**



రంగారెడ్డి జిల్లా, ప్రజాస్ఫూర్తి : యోగా సాధన ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఒత్తిడిని సమర్థవంతంగా జయించవచ్చని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో హెల్త్ వీక్ లో భాగంగా శనివారం గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన యోగా దినోత్సవం గౌరవనీయులైన రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, రహదారులు మరియు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలిసి ముఖ్య అతిథిగా హాజరై యోగా ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి వేగవంతమైన జీవనశైలిలో పెరుగుతున్న ఒత్తిడి, అనారోగ్య సమస్యలకు యోగా ఒక సమగ్ర పరిష్కారమని అన్నారు. యోగా సాధన ద్వారా శారీరక మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని అన్నారు. నిత్యజీవితంలో యోగాను అలవాటు చేసుకోవడం ద్వారా ఒత్తిడి తగ్గి జీవన శైలి సంబంధిత వ్యాధులను నివారించవచ్చని పేర్కొన్నారు. యోగా ద్వారా మానసిక ప్రశాంతత లభించడం వల్ల వ్యక్తిగతంగా మాత్రమే కాకుండా కుటుంబం, సమాజం మొత్తానికి సానుకూల ప్రభావం ఉంటుందని అన్నారు. జిల్లాలో యోగా పట్ల అవగాహన పెంపొందించేందుకు మరిన్ని కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని చిన్న వయస్సు నుంచే యోగా అలవాటు చేయడం అత్యంత అవసరమని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సెక్రెటరీ మెడికల్ , హెల్త్ శ్రీమతి క్రిస్టినా చోగ్తూ, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె లలితాదేవి ,హైదరాబాద్ జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటి జిల్లా ఇమ్మ్యునైజేషన్ అధికారి డాక్టర్ షీబా హయత్ డాక్టర్ పూనం డిపిఓ అక్రమ్ అధికారులు సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## సీసీ కెమెరాల ఏర్పాటుకు
## ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావడం హర్షణీయం

*** మహబూబాబాద్ టౌన్ ఇన్స్పెక్టర్ గట్ల మహేందర్ రెడ్డి**



మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి: సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావడం హర్షణీయమని మహబూబాబాద్ టౌన్ ఇన్స్పెక్టర్ గట్ల మహేందర్ రెడ్డి అన్నారు. మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సుందరయ్య నగర్ కాలనీలో, “నేను సైతం” కార్యక్రమంలో భాగంగా టౌన్ ఇన్స్పెక్టర్ గట్ల మహేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని, మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శభరిష్ పి. ఐపీఎస్ సూచనల మేరకు పట్టణంలోని కాలనీ వాసులు సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయడానికి ఆసక్తి చూపించడం అభినందనీయమని అన్నారు. ఈ చర్య ద్వారా నేరాల నియంత్రణ, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా ఉంచడం, దొంగతనాలు, ఇతర నేరాలు తగ్గుముఖం పడటమే కాకుండా, నేరస్థులను త్వరగా గుర్తించి పట్టుకోవడంలో పోలీసులకు ఎంతో సహకారం లభిస్తుందని అన్నారు. ఈ సందర్భంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన రామచంద్రపురం కాలనికి చెందిన రాంరెడ్డిని, దైవకృపా ఆశ్రమ నిర్వాహకుడైన లోకేష్ నాయక్, సుందరయ్య నగర్ నివాసులైన మహబూబ్అలీ, రేఖ దేవేందర్ను సీఐ అభినందించారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో కాలనీల్లో కూడా సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకుని ఆదర్శంగా నిలవాలని కోరారు. ప్రజలు , పోలీస్ శాఖ కలిసి పనిచేస్తే సమాజం మరింత సురక్షితంగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## ప్రభుత్వ భూముల అక్రమ కబ్జాపై రంగారెడ్డి అడిషనల్ కలెక్టర్‌కు బిఆర్ఎస్ నేతల ఫిర్యాదు



ప్రజాస్ఫూర్తి, షాద్నగర్ : నాదర్‌గుల్ పరిధిలోని సర్వే నంబర్ 673లో ఉన్న సుమారు 373 ఎకరాల ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం అవుతోందని, దీనిపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ బిఆర్ఎస్ నేతలు రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ చంద్రారెడ్డికి ఫిర్యాదు చేశారు. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి నాయకత్వంలో ఎమ్మెల్యే వివేకానంద, ఎమ్మెల్సీలు దాసోజు శ్రావణ్, వాణిదేవి, మాజీ ఎమ్మెల్యేలు మంచిరెడ్డి కిషన్ రెడ్డి, అంజయ్య యాదవ్, పట్నం నరేందర్ రెడ్డి తదితరులు కలెక్టరేట్‌కు చేరుకొని వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఒక మంత్రి, కొందరు నేతలు బౌన్సర్లు, గుండాలను అడ్డం పెట్టుకొని 600 మంది రైతులకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. ల్యాండ్ సీలింగ్ యాక్ట్ పరిధిలోకి వచ్చే ప్రభుత్వ భూములను కబ్జా చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని ఆరోపించారు. కోర్టు పరిధిలో ఉన్న భూముల్లో రైతుల బోర్లను పగలగొట్టి, వ్యవసాయం చేసుకుంటున్న వారిని కొట్టి బయటకు పంపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమంగా షెడ్లు వేసి, రేకులతో బారికేడ్లు నిర్మించి రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఆర్డీఓకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని, కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములను కాపాడటానికి ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ఆయుర్వేద, యునాని, హోమియోపతి పై ప్రజల్లో అవగాహన కల్పించాలి

*** జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్.**



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : ప్రజలు సహజ వైద్య విధానాల వైపు మళ్లేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను సూచించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా శుక్రవారం అయన ప్రభుత్వ కేంద్ర ఆసుపత్రి లో నిర్వహించిన హోమియోపతి డే సందర్భంగా ప్రభుత్వ ఆయుర్వేద, యునాని, హోమియోపతి విభాగాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. హోమియోపతి పితామహుడు డాక్టర్ సామ్యూల్ హానీమన్ చిత్రపటానికి పూలమాల అర్పించి నివాళులు ఘటించారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా వైద్య ఆరోగ్య శాఖ ద్వారా పలు కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ఇందులో భాగంగా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. హోమియోపతి నర్సింగ్ విద్యార్థులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, బయట తినుబండారాలను తగ్గించి, శుభ్రమైన , పోషకాహారం, తాజా పండ్లు తీసుకోవాలని సూచించారు. నర్సింగ్ విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే ఇతరులకు సేవ చేయగలుగుతారని , వైద్య వృత్తిలో ఉన్నవారు ఆరోగ్యంగా ఉండటం అత్యంత అవసరమని తెలిపారు.గతంలో క్యాన్సర్, ప్లేగు వంటి వ్యాధులకు సరైన చికిత్సలు లేక ప్రజలు ప్రాణాలు కోల్పోయేవారని, ప్రస్తుతం వైద్య రంగంలో ఎంతో అభివృద్ధి జరిగిందని తెలిపారు. అయితే సైడ్ ఎఫెక్ట్స్ లేని ఆయుర్వేద, యునాని, హోమియోపతి వైద్య విధానాలపై ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు.. విద్యార్థులు నిత్యం వ్యాయామం, యోగా, జిమ్ వంటి ఆరోగ్యకరమైన అలవాట్లు అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమం అనంతరం జిల్లా కలెక్టర్ ఉచిత వైద్య శిబిరాన్ని సందర్శించి, వైద్య శిబిరం ద్వారా అందిస్తున్న సేవలను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య అధికారి పుట్ల శ్రీనివాస్, డిప్యూటీ డిఎంహెచ్వో వేణుగోపాల్ రెడ్డి, యునాని వైద్య అధికారి డాక్టర్ ముబీన్ పర్వీన్, ప్రోగ్రాం ఇన్చార్జ్ సుహాసిని,డిప్యూటీ సూపరింటెండెంట్ గణేష్ ,తదితరులు, హాజరయ్యారు.

## 12 న మేడ్చల్ జిల్లా పడమట శాఖ భట్రాజు సంఘం ఎన్నికలు



కుత్బుల్లాపూర్, ప్రజాస్ఫూర్తి : మేడ్చల్ జిల్లా పడమట శాఖ భట్రాజు సంక్షేమ సంఘం ఎన్నికలు 12 న ఆదివారం సూరారంలోని కృషి హైస్కూల్లో నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షులు కూరపాటి కరుణాకర్ రాజు, ప్రధాన కార్యదర్శి లోలుబట్టు కృష్ణంరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ఎన్నికల ప్రక్రియ మొదలై సాయంత్రం 4 గంటల వరకు కొనసాగుతుందన్నారు. జిల్లాలోని కుత్బుల్లాపూర్, కూకట్పల్లి, బాచుపల్లి, బాలానగర్, దుండిగల్ మండలాలకు చెందిన బంధువులు హాజరై ఎన్నికల అనుకూలంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## మెంతా తుఫాను బాధితులకు నష్టపరిహారం అందించాలి

*** భూక్య సంపత్ నాయక్, బిజెపి మండల అధ్యక్షులు హుస్నాబాద్**



హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : రాష్ట్ర ప్రభుత్వం రైతుల పట్ల మొండి వైఖరి అవలంబిస్తుందని రైతులకు అందవలసిన నష్టపరిహారం బోనస్ డబ్బులు ఇవ్వడంలో జాప్యం చేస్తుందని హుస్నాబాద్ బిజెపి మండల అధ్యక్షులు భూక్య సంపత్ నాయక్ ఆరోపించారు శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ యాసంగి రైతు భరోసా మరియు మెంతా తుఫాన్ నష్టపరిహార చెక్కుల దిక్కేలేదని,గతంలో ఖరీఫ్ రబీ సన్న రకాల బోనసోసే లేదని ,రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పట్ల మొండి వైఖరి అవలంబిస్తుంది యాసంగి పంటలు కోతలు పూర్తవుతున్న ఇప్పటివరకు రైతు భరోసా సంబంధించి రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయడంలో జాప్యం జరుగుతోందని ఖరీఫ్ సీజన్లో అకాల వర్షాలకు పత్తి, మక్కా వరి పంటలకు సంబంధించి రైతులకు మెంతా తుఫాన్ తో అసలు పెట్టుబడి కూడా రాకుండా పోయిందని ఆయన తెలిపారు. క్షేత్రస్థాయిలో వ్యవసాయ శాఖ అధికారులు సర్వే చేసి సంబంధిత రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.


## ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు సహకరించండి

*** రైతులకు విజ్ఞప్తి చేసిన కలెక్టర్ కే. హైమావతి**



హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : హుస్నాబాద్ నియోజకవర్గంలో అక్కన్నపేట మండలంలో చౌటపల్లి, జనగాం తోటపల్లి గ్రామాలలో ఇండస్ట్రియల్ పార్కుఏర్పాటు కు సహకరించాలని రైతులను సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె హైమావతి విజ్ఞప్తి చేశారు. ఇండస్ట్రియల్ పార్కులో భూములు కోల్పోతున్న రైతులతో ఆమె హుస్నాబాద్ సమీకృత కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దాదాపు 124 ఎకరాల భూమిని టి జి ఐ సి కి అందించడంతో అభివృద్ధి చేసి పరిశ్రమలు స్థాపనతో ఈ ప్రాంత యువకులకు పెద్ద ఎత్తున ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఈ ప్రాంతం అభివృద్ధి కోసం భూమిని ఇవ్వడానికి అందరూ సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ ఆర్డీఓ రామ్మూర్తి, తహసిల్దార్ లక్ష్మారెడ్డి రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సిద్ధి వినాయక టౌన్ షిప్ లో మాధవానంద స్వామి పూజలు



అందోలు, ప్రజాస్ఫూర్తి : జోగిపేటలోని శ్రీ సిద్ధి వినాయక టౌన్షిప్ లో శుక్రవారం రంగంపేట పీఠాధిపతులు శ్రీ మాధవానంద స్వామి హాజరై ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఆకుల చిట్టిబాబు, రాధిక దంపతులు పాదపూజ కార్యక్రమాలు నిర్వహించారు. అక్కడే ఉన్న హనుమాన్ దేవాలయాన్ని సందర్శించి నూతన దేవాలయాన్ని నిర్మించాలని వారికి సూచించారు. అక్కడికి వచ్చిన వారు పాదపూజ కార్యక్రమాలు చేసుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్. కృష్ణారెడ్డి, పిఆర్టియు జిల్లా అధ్యక్షులు ఆకుల మానయ్య, మున్సిపల్ కమిషనర్ రవీందర్, జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర నాయకులు ఆకుల రాంబాబు, ఎంఈఓ కృష్ణ, కౌన్సిలర్లు పి. శివ శేఖర్, రామకృష్ణ, మాజీ చైర్మన్ మల్లయ్య, మాజీ కౌన్సిలర్ ప్రదీప్ గౌడ్, రంగ సురేష్, కాసాల ప్రవీణ్, నరేందర్ గౌడ్, డాక్టర్ అనంతరెడ్డి,పి. ప్రవీణ్, నరోత్తం, తదితరులు పాల్గొన్నారు

# సిఎంఆర్ఎఫ్ చెక్కులను బాధితులకు అందజేత



ప్రజాస్ఫూర్తి , షాద్ నగర్ : ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి సిఫారసుతో షాద్ నగర్ నియోజకవర్గంలోని కొత్తూరు మండలంలోని ఇన్ముల నర్వ గ్రామానికి చెందిన అక్కసాని సుమలత కి మంజూరైన సీఎమ్ఆర్ఎఫ్ చెక్కులను ఇన్ముల నర్వ గ్రామ బీఆర్ఎస్ నాయకుల చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఇన్ముల నర్వ సర్పంచ్ లలితగోపాల్ నాయక్ వార్డ్ సభ్యులు కె.కుమార్ మాజీ వార్డ్ సభ్యులు శ్యామ్ సుందర్ రెడ్డి, బీఆర్ ఎస్ నాయకులు ఇంద్రసేన రెడ్డి , రాజవర్ధన్ , అజయ్ గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేట్, ప్రైవేట్ కళాశాలపై చర్యలు తీసుకోవాలి

* **ఏఐఎస్ఎఫ్**



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడిపిస్తున్న ప్రైవేటు, కార్పొరేటు కళాశాలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి దశ్రు నాయక్ కి వినత పత్రం అందజేశారు.ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళి కృష్ణ మాట్లాడుతూ కార్పొరేట్, ప్రైవేట్ కళాశాలలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా తరగతులు,నిర్వహిస్తున్నారని, ముందస్తు అడ్మిషన్లు తీసుకుంటున్నారని, విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తున్నారని అన్నారు. కార్పొరేట్, ప్రైవేట్ కళాశాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.వినతిపత్రం అందజేసిన వారిలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కాదేపాక సూర్య తేజ, మహేష్, కిరణ్,తరుణ్ తదితరులు.

# ధనిక రాష్ట్రాన్ని అప్పగిస్తే.. రూ.8 లక్షల కోట్ల అప్పు ఎందుకు?

: **జూపల్లి**



హైదరాబాద్: గత ప్రభుత్వ నాయకులకు సరైన ఆలోచన, అవగాహన లేక రాష్ట్రానికి తీవ్ర నష్టం చేశారని మంత్రి జూపల్లి కృష్ణారావు ఆరోపించారు. నీళ్లు లేని చోట మాత్రం పదేళ్లలో అనేక ప్రాజెక్టులు కట్టారని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీకి ధనిక రాష్ట్రం అప్పగిస్తే, రూ.8 లక్షల కోట్లు ఎందుకు అప్పు చేశారని విమర్శించారు. పాలమూరు ప్రాజెక్టు కాలువలకు ఇంకా అనుమతే రాలేదన్న జూపల్లి.. పాలమూరు ప్రాజెక్టుపై రాజకీయాలు చేస్తోంది మీరా? మేమా? అని నిలదీశారు. పాలమూరు ప్రాజెక్టును 80శాతం పూర్తి చేశామని అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు.


# శంషాబాద్ నుంచి వెళ్లాల్సిన విమానంలో సాంకేతిక సమస్య




హైదరాబాద్: శంషాబాద్ నుంచి కోల్‌కతా వెళ్లాల్సిన స్పైస్ జెట్ విమానంలో సాంకేతిక సమస్య తలెత్తింది. టేకాఫ్ తీసుకునే సమయంలో పైలట్ ఇంజిన్‌లో సమస్యను గుర్తించాడు. విమానాన్ని తిరిగి పార్క్ చేసి ప్రయాణికులను కిందకు దింపారు. మధ్యాహ్నం 3.15 గంటల నుంచి శంషాబాద్‌లోనే ప్రయాణికులు పడిగాపులు కాస్తున్నారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయలేదని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ పూర్తి మద్దతు

: **సీఎం రేవంత్‌రెడ్డి**



ఢిల్లీ: మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ పూర్తి మద్దతిస్తుందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. మహిళల కోసం బిల్లు తీసుకొచ్చిందే కాంగ్రెస్ అని ఆయన అన్నారు. సీడబ్ల్యూసీ సమావేశంలో పాల్గొనేందుకు ఢిల్లీ వెళ్లిన రేవంత్‌రెడ్డి.. భేటీ అనంతరం ఇష్టాగోష్టిగా మీడియాతో మాట్లాడారు. ''స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లను రాజీవ్‌గాంధీ అమలు చేశారు. మహిళా బిల్లును సోనియాగాంధీ గతంలోనే పార్లమెంట్‌లో పెట్టారు. 33 శాతం మహిళా రిజర్వేషన్లలో ఓబీసీ కూడా అమలు చేయాలి. మహిళా రిజర్వేషన్లను డీలిమిటేషన్‌తో ఎందుకు లింక్ పెడుతున్నారు? ప్రస్తుతమున్న 543లో కూడా మహిళా రిజర్వేషన్ అమలు చేయొచ్చు. ప్రస్తుత సీట్లతోనే మహిళా రిజర్వేషన్ అమలు చేస్తే ఎవరూ అడ్డుపడరు. ఉత్తర దక్షిణాది రాష్ట్రాల మధ్య అంతరాన్ని పెంచాలని భాజపా చూస్తోంది. ఆర్థిక అంతరాలతో ఇప్పుడు రాజకీయ అంతరాలు తీసుకొస్తున్నారు. ప్రస్తుతం ఉత్తర, దక్షిణాది మధ్య నియోజకవర్గాల్లో అంతరం ఉంది. కొత్త అంతరం ప్రస్తుతం మోతాదులోనే ఉంటే ఎవరికీ అభ్యంతరం ఉండదు. ఎన్డీయే చెబుతున్న లెక్కలు ఉత్తరదక్షిణాది మధ్య పెద్ద అంతరం పెంచనున్నాయి. ఐదు రాష్ట్రాలతోనే కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయాలన్నది భాజపా ఆలోచన'' అని రేవంత్‌రెడ్డి అన్నారు.

# డిజిటల్ సాంకేతికతతో అంగన్‌వాడీ సేవల మెరుగుదల

: **రాష్ట్ర మంత్రి సీతక్క**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: అంగన్‌వాడీ సేవలను డిజిటల్ సాంకేతికతతో మరింత మెరుగుపరచడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర మంత్రి దానసరి అనసూయ (సీతక్క) తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని ఐడీఓసీ కార్యాలయంలో శుక్రవారం పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని ప్రారంభించి, అంగన్‌వాడీ టీచర్లకు స్మార్ట్‌ఫోన్‌లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న స్మార్ట్‌ఫోన్‌ల పంపిణీతో సేవల నాణ్యత పెరుగుతుందని చెప్పారు. పిల్లల బరువు, పోషకాహారం, గర్భిణీలు, బాలింతల ఆరోగ్య వివరాలను డిజిటల్ విధానంలో నమోదు చేయడం ద్వారా పారదర్శకత, వేగం పెరుగుతాయని వివరించారు.స్మార్ట్‌ఫోన్‌ల కొనుగోలు ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించినట్లు తెలిపారు. ఓపెన్ టెండర్ విధానంలో ఒక్కో ఫోన్‌ను రూ.11,650కు కొనుగోలు చేయగలిగామని, ప్రజల డబ్బు ఆదా చేయడమే లక్ష్యమని స్పష్టం చేశారు. తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని సూచించారు.పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ స్మార్ట్‌ఫోన్‌ల పంపిణీతో అంగన్‌వాడీ సేవలు మరింత సమర్థవంతంగా మారతాయని అన్నారు. అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అంగన్‌వాడీ సేవల ఆధునికీకరణలో ఈ చర్య కీలకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అంకిత్ ,స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్రానికి ఎన్డబ్ల్యూసీ స్టేట్ డైరెక్టర్‌గా శివరాత్రి నిఖిల్



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : నెచర్ వెల్ఫేర్ కౌన్సిల్ (ఎన్డబ్ల్యూసీ) సంస్థ తెలంగాణ రాష్ట్ర స్టేట్ డైరెక్టర్‌గా జగద్గిరిగుట్ట డివిజన్ మగ్దూంనగర్కు చెందిన శివరాత్రి నిఖిల్ నియమితులయ్యారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సంస్థ కార్యాలయంలో ఘనంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివరాత్రి నిఖిల్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు, మరియు సస్టైనబుల్ డెవలప్మెంట్ లక్ష్యాల సాధనలో తనవంతు కృషి చేస్తానని తెలిపారు. సామాజిక సేవ , ప్రజా పరిపాలన రంగాల్లో తన అనుభవంతో రాష్ట్రవ్యాప్తంగా ఎన్డబ్ల్యూసీ కార్యకలాపాలను విస్తరించేందుకు కృషి చేస్తానని అన్నారు. ఈ నియామకంతో తెలంగాణలో ఎన్డబ్ల్యూసీ సంస్థ కార్యకలాపాలు మరింత వేగవంతం అవుతాయని సంస్థ ప్రతినిధులు తెలిపారు.ఈ కార్యక్రమంలో చైర్మన్ జంత రామ్ చౌదరి, వైస్ చైర్మన్ వంగాల సతీష్ , నేషనల్ డైరెక్టర్ నాగయ్య ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# నేత్రదానానికి 'సొట్టొ తెలంగాణ'లో నమోదు తప్పనిసరి



నిమ్స్(హైదరాబాద్): నేత్రదానం కోసం కార్యకలాపాలు నిర్వహించే ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల నిర్వాహకులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని.. లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని 'సొట్టొ తెలంగాణ' (జీవన్‌దాన్) నోడల్ అధికారి ప్రొ.శ్రీభూషణ్‌రాజు అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో నేత్రదానం కోసం కంటి కార్నియా మార్పిడి కార్యకలాపాలను నిర్వహిస్తున్న కొన్ని ప్రైవేటు ఆసుపత్రులతో పాటు పలు స్వచ్ఛంద సంస్థలు ప్రభుత్వ నిబంధనలు పాటించడం లేదని అన్నారు. ఈ నేపథ్యంలో మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయడం, పారదర్శకత, సమన్వయం, ఉన్నత ప్రమాణాలను మెరుగు పరిచేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. సంబంధిత సంస్థలు వీలైనంత త్వరగా తమ పేర్లతో రిజిస్ట్రేషన్‌ను పూర్తి చేసి నేత్రదాన కార్యక్రమాన్ని మరింత బలోపేతం చేసేందుకు సహకరించాలని కోరారు. ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆఫ్ హ్యూమన్ ఆర్గాన్స్ అండ్ టిష్యూ యాక్ట్ (థోటా 1994) నిబంధనల ప్రకారం ఈ నమోదు ప్రక్రియను తప్పనిసరి చేసినట్లు పేర్కొన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మరిన్ని వివరాలకు 04023489494 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

# రొబోటిక్ సర్జరీల్లో 'అపోలో' ప్రపంచ రికార్డు

: **డా.సంగీతా రెడ్డి**



ఫిల్మ్‌నగర్: గుండె శస్త్ర చికిత్సల్లో జూబ్లీహిల్స్ అపోలో ఆసుపత్రి ప్రపంచ రికార్డు సృష్టించిందని, 155 రోజుల్లో 100 రొబోటిక్ కార్డియాక్ సర్జరీలు విజయవంతంగా పూర్తి చేసిందని అపోలో హాస్పిటల్స్ గ్రూప్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డా.సంగీతారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ అపోలో ఆసుపత్రిలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డా.సంగీతారెడ్డి మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్య సేవలకు అపోలో కట్టుబడి ఉందన్నారు. దేశంలోనే తొలిసారిగా రొబోటిక్ సర్జరీలు ప్రారంభించిన ఆసుపత్రుల్లో అపోలో ముందు వరుసలో ఉందన్నారు. 'డా విన్సీ' వంటి అత్యాధునిక వ్యవస్థలతో శస్త్ర చికిత్సలు జరుగుతున్నాయని తెలిపారు. డా.నాగేశ్ నేతృత్వంలో 155 రోజుల్లో 100 గుండె ఆపరేషన్లు చేయడం అరుదైన ఘనత అని డా. సంగీతారెడ్డి పేర్కొన్నారు. భవిష్యత్తులో 5060శాతం గుండె శస్త్ర చికిత్సలు రొబోటిక్ విధానంలోనే జరిగే అవకాశం ఉందన్నారు. భారత వైద్యులు ప్రపంచ రోగులకు సేవలు అందించే స్థాయికి చేరుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. 'అపోలో' సీనియర్ కన్సల్టెంట్ హార్ట్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్ డా.నాగేశ్ మాట్లాడుతూ.. ఓపెన్ హార్ట్ సర్జరీలతో పోలిస్తే రొబోటిక్ శస్త్ర చికిత్సలతో అనేక ప్రయోజనాలున్నాయని తెలిపారు. కార్యక్రమంలో అపోలో ఆసుపత్రి రీజినల్ సీఈఓ తేజస్వీరావు, సీఓఓ రామ్‌చందర్, మెడికల్ డైరెక్టర్ డా.రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ డీజీపీ ఎదుట లొంగిపోయిన 42 మంది మావోయిస్టులు



హైదరాబాద్: గత ఏడాదిన్నర కాలంలో 763 మంది మావోయిస్టులు లొంగిపోయినట్లు డీజీపీ శివధర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం 42 మంది మావోయిస్టులు ఆయుధాలతో సహా డీజీపీ ఎదుట లొంగిపోయారు. వీరిలో బెటాలియన్ డిప్యూటీ కమాండర్ కేశాలు కూడా ఉన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో కూంబింగ్ పెరగడంతో మావోయిస్టులు తెలంగాణ పోలీసులను ఆశ్రయించారు. లొంగిపోయిన వారిలో ఒక్కరు మాత్రమే తెలంగాణకు చెందివారు కాగా.. ఎక్కువమంది ఛత్తీస్‌గఢ్‌కు చెందినవారే. ''లొంగిపోయిన వారికి పునరావాస ప్యాకేజీ కింద రూ.1.93 కోట్లు అందజేస్తున్నాం. సీఎం ఆదేశాల మేరకు ఆరోగ్యకార్డులు అందజేస్తాం. తెలంగాణకు చెందిన వాళ్లు సెంట్రల్ కమిటీలో 11 మంది ఉండేవారు. ఇప్పుడు ఇద్దరున్నారు. స్టేట్ కమిటీలో తెలంగాణ వాళ్లు 24 మంది ఉండేవారు. ఇప్పుడు ఇద్దరే ఉన్నారు. వాళ్లు కూడా లొంగిపోవాలని పిలుపునిస్తున్నాం'' అని డీజీపీ శివధర్‌రెడ్డి పేర్కొన్నారు.

# తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగులకు శుభవార్త




హైదరాబాద్: తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఈ క్యాలెండర్ సంవత్సరం (2026) నుంచి 2.1% డీఏను పెంచుతున్నట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. ఇంతకు ముందు 50.7% డీఏ ఉండగా.. ఇప్పుడు అది 52.8%కి పెరిగింది. పెరిగిన డీఏ జనవరి 1, 2026 నుంచి అమల్లోకి రానుంది. పెరిగిన డీఏ ద్వారా ఆర్టీసీపై ప్రతి నెల రూ.2.82 కోట్ల అదనపు భారం పడనుంది. డీఏ పెంపు సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, ఇతర ఉన్నతాధికారులు కృతజ్ఞతలు తెలిపారు.

# కమీషన్ల కోసమే కాళేశ్వరానికి ఇప్పుడు మరమ్మతులు : కవిత



హైదరాబాద్: కాళేశ్వరాన్ని వినియోగంలోకి తేవాలని ప్రభుత్వం నిర్ణయించడాన్ని స్వాగతిస్తున్నట్లు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. రెండున్నరేళ్లు దారుణంగా వ్యవహరించి పంటలు ఎండబెట్టారని ఆరోపించారు. హైదరాబాద్‌లో కవిత మీడియాతో మాట్లాడారు. కమీషన్ల కోసమే ఇప్పుడు కాళేశ్వరానికి మరమ్మతులు అంటున్నారని మండిపడ్డారు. మున్సిపల్, అర్బన్ ఫారెస్ట్రీలో తీవ్రమైన అవినీతి జరుగుతోందన్నారు. రియల్ ఎస్టేట్ కోసం ఫ్యూచర్ సిటీ పేరుతో హైదరాబాద్‌కు నష్టం చేయవద్దని కోరారు.

# ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత

* **ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ఆర్. విద్యా సాగర్ రెడ్డి**




ప్రజాస్ఫూర్తి, పటాన్ చెరు : ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ఆర్. విద్యా సాగర్ రెడ్డి అన్నారు. రోడ్డు భద్రతపై ప్రజల్లో చైతన్యం పెంపొందించేందుకు ఆర్సీ పురం ట్రాఫిక్ పోలీసులు మంజీరా పైప్‌లైన్ రోడ్ వద్ద హెల్మెట్ వినియోగంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాల్సిన అవసరాన్ని అధికారులు వివరించారు. ప్రమాదాల సమయంలో హెల్మెట్ వినియోగం ద్వారా గాయాలు , మరణాలను గణనీయంగా తగ్గించుకోవచ్చని ప్రజలకు తెలియజేశారు. రోడ్డు భద్రతకు హెల్మెట్ కీలక పాత్ర పోషిస్తుందని, ప్రతి వాహనదారుడు స్వచ్ఛందంగా భద్రతా నియమాలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు రాములు, మల్లన్న , ఏఎస్ఐ మల్లేష్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


# త్వరలో షాద్ నగర్ మున్సిపాలిటీ ఇంటికి ఇంటికి పిఎన్జీ గ్యాస్ కనెక్షన్

* **షాద్ నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్**



ప్రజాస్ఫూర్తి , షాద్ నగర్ : మున్సిపాలిటీ 23వార్డులో షాద్నగర్ మున్సిపాలిటి డిపిఎన్జీ (డొమెస్టిక్ పైపుడ్ నేచురల్ గ్యాస్ ) అండర్ గ్రౌండ్ గ్యాస్ పైప్ లైన్ సిస్టమ్ ఏర్పాటులో భాగంగా పరిశీలించిన మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. గ్యాస్ పిఎంజి కనెక్షన్ బరువున్న సిలిండర్లతో ఇబ్బంది పడకుండా, నేరుగా పైపు ద్వారా మీ వంటింటికి సురక్షితమైన గ్యాస్ సరఫరా. అత్యంత భద్రతా ప్రమాణాలతో 24/7 అందుబాటులో ఉంటుంది. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పెంటయ్య, కాలనీ వాసులు , కల్వ యాదగిరి,శేఖర్, అగ్గనూర్ నందు,కాపర్తి ప్రవీణ్, కైలాష్‌నాథ్,పానుగంటి వెంకటేష్, మల్లేష్, రాకేష్, మాధవచారి,గంతల శివ రాజ్ ,తదితరులు పాల్గొన్నారు.

# సమ్మక్కసారలమ్మ వర్సిటీ, ఐఐటీ హైదరాబాద్ మధ్య ఒప్పందం



హైదరాబాద్: సమ్మక్కసారలమ్మ గిరిజన వర్సిటీ ఐఐటీ హైదరాబాద్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. మర్రి చెన్నారెడ్డి మానవవనరుల అభివృద్ధి కేంద్రంలో జరిగిన ఒప్పంద కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర గిరిజన వర్సిటీని తొలుత మహబూబ్‌నగర్‌లో పెట్టాలనుకున్నామని, కానీ, కేంద్రం ములుగులోనే గిరిజన వర్సిటీని ఏర్పాటు చేస్తుందని అన్నారు. ''ఈ ఏడాది ప్రధాని మోదీ గిరిజన వర్సిటీ నిర్మాణానికి భూమిపూజ చేస్తారు. రెండు కేంద్ర సంస్థలు ఈ వర్సిటీకి సహకారం అందిస్తాయి. సమ్మక్కసారలమ్మ యూనివర్సిటీ భవిష్యత్‌లో గొప్ప అభివృద్ధి సాధిస్తుంది. గిరిజనులకు కావాల్సిన ఆధునిక సాంకేతికతను అందిస్తుంది. అబిడ్స్‌లో గిరిజన మ్యూజియం ఏర్పాటు చేస్తున్నాం. గిరిజనుల సంక్షేమం కోసం కేంద్రం ఎంతో కృషి చేస్తోంది. ఏజెన్సీ ప్రాంతాల్లో కేంద్రం రూ.24వేల కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోంది'' అని కిషన్‌రెడ్డి అన్నారు.

# తెలంగాణపై కాంగ్రెస్ అధిష్ఠానం పట్టు కోల్పోయింది

: **జీవన్‌రెడ్డి**

ఎర్రవల్లి: మాజీ సీఎం కేసీఆర్‌తో భేటీ అనంతరం మాజీ మంత్రి జీవన్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ అధిష్ఠానం తెలంగాణపై పట్టు కోల్పోయిందని వ్యాఖ్యానించారు. ఒకప్పుడు పీసీసీ చెప్పినట్లు సీఎం నడుచుకునేవారని, ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి చెప్పిందే పీసీసీ అమలు చేస్తోందని అన్నారు. కేసీఆర్‌తో దాదాపు 5 గంటలపాటు జీవన్‌రెడ్డి సమావేశమయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. తన విషయంలో పీసీసీ తప్పు చేసి.. ఆ నింద ఏఐసీసీపై వేస్తోందన్నారు. ''నాకు 14 సార్లు బీ ఫామ్ ఇచ్చారంటే.. అది నా సమర్థతతోనే. కాంగ్రెస్ పార్టీ తిరోగమనంలో పయనిస్తోంది. కాంగ్రెస్ పోవాలి.. కేసీఆర్ రావాలి అని ప్రజల్లో చర్చ మొదలైంది. త్వరలో జగిత్యాలలో సభపెట్టి బీఆర్ఎస్‌లో చేరతాను'' అని జీవన్‌రెడ్డి పేర్కొన్నారు.

# సూయిజ్‌పై ఈజిప్ట్ టోల్.. హర్మూజ్‌పై ఇరాన్‌కు నో చెప్తున్నారెందుకు?

ఏప్రిల్ 10 : పశ్చిమాసియా ఘర్షణలతో హర్మూజ్ జలసంధి పేరు ప్రపంచ వ్యాప్తంగా మారుమోగుతోంది. ఇటీవల సీజ్‌ఫైర్‌లో కూడా ఇరాన్ డిమాండ్లలో హర్మూజ్‌పై నియంత్రణ అంశం కూడా ప్రధానంగా ఉంది. ప్రపంచ ఇంధన రవాణాకు కీలకమైన ఈ జలసంధి నుంచి రాకపోకలు సాగించే ఒక్కో చమురు ట్యాంకర్‌పై ఇరాన్ గరిష్ఠంగా దాదాపు రూ.18 కోట్లు టోల్ రూపంలో వసూలు చేయాలని భావించినట్లు కూడా గతంలో వార్తలు వచ్చాయి. అయితే, ఇది అంతర్జాతీయ జలమార్గమని, ఇంతకుముందెన్నడూ లేనివిధంగా ఇప్పుడు రుసుము వసూలు చేసే హక్కు లేదని పలుదేశాలు పేర్కొంటున్నాయి. అంతర్జాతీయ వాణిజ్యానికి జీవనాడి అయిన సూయిజ్ కెనాల్ నుంచి వెళ్లే నౌకలకు ఈజిప్ట్ ఫీజు వసూలు చేస్తోంది. మరి, ఇది చట్టబద్ధమైనప్పుడు ఇరాన్ వాదనను ఎందుకు అంగీకరించడం లేదు? అంతర్జాతీయ చట్టాలు ఏం చెప్తున్నాయి? అమెరికా ఇజ్రాయెల్ భీకర దాడులు మొదలు పెట్టగానే ఇరాన్ వెంటనే



హర్మూజ్ వద్ద పట్టుబిగించింది. అమెరికా, దాని మిత్రదేశాల నౌకలను అడ్డుకునేందుకు ఇరాన్ దానిలో సీ మైన్స్ పరిచిన సంగతి తెలిసిందే. తన మిత్రులకు చెందిన నౌకలను మాత్రమే పరిమిత సంఖ్యలో అనుమతించింది. ఒకవేళ ఈ యుద్ధం ఒక కొలిక్కి వచ్చినా.. హర్మూజ్‌పై పట్టును మాత్రం కోరుకుంటోంది. క్రిప్టో కరెన్సీలో టోల్ వసూలు చేయాలనుకుంటున్నట్లుగా కూడా వార్తలు వచ్చాయి. అంతర్జాతీయ సముద్ర చట్టాన్ని పర్యవేక్షించే యునైటెడ్ నేషన్స్ ఒప్పందాల ప్రకారం..తమ సరిహద్దుగా ఉన్న జలసంధి మీదుగా నౌకలు వెళ్లడానికి ఆయా దేశాలు ఫీజు వసూలు చేయడానికి అనుమతి లేదు. అయితే పైలటింగ్, టగ్గింగ్, పోర్ట్ సర్వీస్ అందిస్తే.. పరిమిత స్థాయిలో ఫీజు వసూలు చేసుకోవచ్చు. ఈ ఫీజు పేరిట ఏ దేశాన్నీ లక్ష్యంగా చేసుకోకూడదు. జలసంధి సహజంగా ఏర్పడుతుంది. అలా కాకుండా తవ్వడం ద్వారా ఏర్పడిన కాలువలను జలసంధికి భిన్నంగా పరిగణిస్తారు. అలాగే అంతర్జాతీయ వాణిజ్యంలో కీలకమైనవే సూయిజ్, పనామా కాలువలు.

## ఇంధన భద్రతపై గల్ఫ్ దేశాలతో చర్చలు : విదేశాంగ శాఖ



న్యూఢిల్లీ, ఏప్రిల్ 10 : లెబనాన్‌లో ఇజ్రాయెల్ కొనసాగిస్తోన్న దాడులపై భారత విదేశాంగ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దాడుల్లో అనేక మంది ప్రజలు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. పశ్చిమాసియాలోని పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్నామని.. లెబనాన్‌లోని భారత పౌరుల భద్రతపై ఎప్పటికప్పుడు అక్కడి భారత రాయబార కార్యాలయంతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపారు. దేశ ఇంధన భద్రతను బలోపేతం చేసేందుకు కేంద్ర మంత్రులు గల్ఫ్ దేశాల్లో పర్యటిస్తున్నారని రణ్‌ధీర్ జైస్వాల్ వెల్లడించారు. ఈ మేరకు ఖతార్‌తో ఒప్పందం చేసుకొనేందుకు చర్చలు కొనసాగుతున్నాయన్నారు. అదే సమయంలో పొరుగు దేశాల ఇంధన అవసరాలనూ తీర్చడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. రెండు వారాల క్రితం భారత్.. శ్రీలంకకు 38 మెట్రిక్ టన్నుల పెట్రోలియం ఉత్పత్తులను సరఫరా చేసినట్లు వెల్లడించారు. ప్రస్తుత ఉద్రిక్తతల నేపథ్యంలో అంతర్జాతీయ సముద్ర జలాల్లో చిక్కుకుపోయిన భారత నావికులను సురక్షితంగా స్వదేశానికి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. దేశంలో ఎల్‌పీజీ, పెట్రోల్ ఇతర ఇంధన నిల్వలకు ఎటువంటి కొరతా లేదని పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ సుజాత శర్మ పేర్కొన్నారు. పెట్రోల్ బంకులలో తగినంత నిల్వలు ఉన్నాయని.. ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. గృహ వినియోగ ఎల్‌పీజీ సిలిండర్ల సరఫరా సాధారణంగానే ఉందన్నారు.

## ఆ 'కార్గిల్ హీరో' ఇక లేరు.. ఎవరీ సోనమ్ వాంగ్‌చుక్?

కార్గిల్ యుద్ధం సమయంలో ఎంతో ధైర్యసాహసాలు ప్రదర్శించి గుర్తింపు పొందిన కర్నల్ సోనమ్ వాంగ్‌చుక్ (రిటైర్డ్) కన్నుమూశారు. ఆయన వయసు 61 సంవత్సరాలు. లేహ్‌లోని తన నివాసంలో గుండెపోటుతో మరణించారు. ఈ మాజీ సైనికుడి మృతిపట్ల భారత సైన్యం సహా రక్షణ మంత్రి రాజ్‌నాథ్ ప్రగాఢ సంతాపం తెలియజేశారు. కార్గిల్ యుద్ధంలో వాంగ్‌చుక్ ఎంతో తెగువ చూపారని, పర్వత ప్రాంతాల్లో అత్యంత ప్రతికూల పరిస్థితులలో శౌర్యాన్ని ప్రదర్శించి సైన్యానికి స్ఫూర్తిగా నిలిచారని రక్షణ మంత్రి గుర్తుచేసుకున్నారు. ఆయన్ను లద్దాఖ్ గర్వించదగిన పుత్రుడిగా రాజ్‌నాథ్ అభివర్ణించారు. వాంగ్‌చుక్ చేసిన సేవలకు గాను ప్రతిష్ఠాత్మక మహావీర చక్ర పురస్కారం అందుకున్నారు.

**అప్పుడు ఏం జరిగింది..?**


1999 మే 30న 'ఆపరేషన్ విజయ్' కొనసాగుతున్న సమయంలో మేజర్‌గా ఉన్న వాంగ్‌చుక్.. బటాలిక్ సెక్టార్‌లో లద్దాఖ్ స్కౌట్స్‌లోని ఓ బృందానికి నేతృత్వం వహించారు. అయితే, నియంత్రణ రేఖపై దాదాపు 5500 మీటర్ల ఎత్తులో ఉన్న శిఖరాన్ని స్వాధీనం చేసుకునే



బాధ్యతను సైనికాధికారులు వీరికి అప్పగించారు. శత్రువుల ఆక్రమణ, తదనంతర చొరబాట్లను నిరోధించేందుకు ఇదెంతో కీలకం. అత్యంత ప్రతికూల వాతావరణం ఉండే ఈ ప్రాంతాన్ని ఎటువంటి ఫిరంగి దళాల మద్దతు లేకుండానే వాంగ్‌చుక్ బృందం చేరుకొంది. శత్రువులకు చెక్ పెట్టడంతోపాటు సైన్యానికి స్ఫూర్తిగా నిలిచిన నాటి పరిణామం కార్గిల్ పోరులో కీలక ఘట్టంగా నిలిచింది.

## రష్యాలో చిక్కుకుపోయిన 26 మంది భారతీయులు.. సుప్రీం కోర్టులో పిటిషన్

రష్యాలో చిక్కుకుపోయిన 26 మంది భారతీయులను స్వదేశానికి సురక్షితంగా తీసుకొచ్చేలా కేంద్రాన్ని ఆదేశించాలని కోరుతూ సుప్రీం కోర్టు (Supreme Court)లో పిటిషన్ దాఖలైంది. దీనిని పరిశీలించిన న్యాయస్థానం విచారణకు అంగీకరించింది. ఉపాధి అవకాశాలు కల్పిస్తామని వారిని మభ్యపెట్టి రష్యా (Russia)కు పంపించిన కొందరు ఏజెంట్లు.. తప్పుదోవ పట్టించారనే ఆరోపణలున్నాయి. ఆ తర్వాత పుతిన్ సైన్యంతో కలిసి ఉక్రెయిన్ యుద్ధంలో (Ukraine Crisis) పాల్గొనేలా వారిపై ఒత్తిడి తెచ్చారని సమాచారం. 26 మంది ఆచూకీ తెలుసుకోవడానికి



దౌత్యపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధిత కుటుంబాలు సుప్రీం కోర్టును ఆశ్రయించాయి. మాస్కో నిర్బంధంలో ఉన్న వారి ప్రస్తుత పరిస్థితి ఏంటనే విషయాన్ని తెలియజేయాలని అందులో పేర్కొన్నాయి. ఉక్రెయిన్‌తో రష్యా చేస్తోన్న యుద్ధంలో వీరు పాల్గొనాల్సి వచ్చిందని.. కొందరు గాయపడ్డట్లు, మరికొందరు నిర్బంధంలో ఉన్నట్లు తెలిసిందని పిటిషనర్ తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. పిటిషనర్ల విజ్ఞప్తిని పరిశీలించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం.. కేంద్రాన్ని వివరణ కోరింది. ఈ పిటిషన్‌ను పరిశీలించి, కేంద్రం నుంచి సూచనలు తీసుకుంటానని ప్రభుత్వ సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు తెలియజేశారు. ఇందుకు అంగీకరించిన న్యాయస్థానం.. ఈ నెల చివరలో దీనిపై విచారణ చేపడతామని తెలిపింది.

## నో పొల్యూషన్ సర్టిఫికెట్ లేదని.. ఈవీకి ఫైన్!




నాగౌర్ (రాజస్థాన్), ఏప్రిల్ 10 : కాలుష్య నియంత్రణ సర్టిఫికెట్ (PUC) లేనందుకు పోలీసులు ఓ ఎలక్ట్రిక్ వాహనదారుడికి చలాన్ జారీ చేశారు. ఈ ఘటన రాజస్థాన్‌లోని నాగౌర్‌లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. వాహన తనిఖీల్లో భాగంగా టాటా టియాగో ఈవీ కారును ఓ పోలీస్ అధికారి ఆపారు. కారుకు బ్లాక్ ఫిల్మ్ అమర్చి ఉండటంతో రూ.200 జరిమానా విధించారు. వాహన సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న సమయంలో నో పొల్యూషన్ సర్టిఫికెట్ లేకపోవడంతో అదనంగా రూ.1,500 జరిమానా విధించారు. ఈవీకి నో పొల్యూషన్ సర్టిఫికెట్ అవసరం లేదని కారు యజమాని చెబుతున్నప్పటికీ పోలీసులు వినకపోవడంతో ఇరువురి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై రాజస్థాన్ పోలీసులు స్పందిస్తూ.. కారు విండోలకు ఉన్న బ్లాక్ ఫిల్మ్‌ను తొలగించే విషయంలో పోలీసులకు, వాహనదారుడికి వాగ్వాదం జరిగిందని తెలిపారు. ఈ గందరగోళంలో పొరపాటున కాలుష్య ఉల్లంఘన చలాన్ జారీ చేసినట్లు తెలిపారు. ఈ ఘటనపై దర్యాప్తు జరుగుతోందన్నారు. కేంద్ర రోడ్డు రవాణా రహదారుల మంత్రిత్వ శాఖ (MoRTH) ప్రకారం.. బ్యాటరీతో నడిచే వాహనాలకు కాలుష్య నియంత్రణ (PUC) సర్టిఫికెట్ అవసరం లేదు. ఎందుకంటే ఈ వాహనాలు ఎటువంటి కాలుష్య కారకాలనూ విడుదల చేయవు. కాలుష్య కారకాలను విడుదల చేసే వాహనాలకు తప్పనిసరిగా పొల్యూషన్ అండర్ కంట్రోల్ (పీయూసీ) సర్టిఫికెట్లు ఉండాలి.

## మహిళలకు రూ.3వేలు, ఆరు నెలల్లో యూసీసీ అమలు: బెంగాల్‌లో భాజపా మ్యానిఫెస్టో

కోల్‌కతా, ఏప్రిల్ 10: పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో భాజపా తన మ్యానిఫెస్టోను విడుదల చేసింది. 'సంకల్ప్ పత్ర' పేరుతో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా శుక్రవారం దీన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వంపై అమిత్‌షా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆ ప్రభుత్వ 15 ఏళ్ల పాలన పశ్చిమబెంగాల్‌కు ఒక పీడకల అని అభివర్ణించారు. రాష్ట్ర ప్రజలు ప్రస్తుతం భయంతో జీవిస్తున్నారని.. వారు మార్పు కోరుకుంటున్నారని అమిత్‌షా అన్నారు. తాము అధికారంలోకి వచ్చాక బెంగాల్‌లోని అన్నివర్గాలను నిరాశ నుంచి బయటపడేస్తామన్నారు. పంట నష్టాల కారణంగా సతమతమవుతున్న రైతులు, నిరుద్యోగ యువత, భయంతో జీవిస్తున్న మహిళలకు కొత్త దారి చూపిస్తామన్నారు. కాగా.. బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలు ఏప్రిల్ 23, 29న రెండు విడతలుగా జరగనున్నాయి. మే 4న ఓట్ల లెక్కింపు ఉండనుంది.



* **మ్యానిఫెస్టోలోని ముఖ్యాంశాలు..**
* గోవుల అక్రమ రవాణాపై కఠిన చర్యలు
* బెంగాల్‌లో చొరబాటుదారులపై జీరో టోలరెన్స్
* ఆరు నెలల్లో ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ) అమలు
* ఉద్యోగులకు 7వ వేతన సంఘం అమలు
* ఐదేళ్లలో కోటి కొత్త ఉద్యోగాలు
* స్వయంఉపాధి అవకాశాలు
* నిరుద్యోగ యువతకు నెలకు రూ.3వేలు
* మహిళలకు ప్రతినెలా రూ.3వేలు ఆర్థిక సాయం
* మహిళల కోసం ప్రత్యేక పోలీస్ బెటాలియన్లు
* రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు

## మానసిక సమస్యలతోనే సీజే రాయ్ ఆత్మహత్య!

బెంగళూరు (యలహంక): ప్రముఖ వ్యాపారవేత్త, కాన్ఫిడెంట్ గ్రూపు సంస్థల అధ్యక్షుడు సీజే రాయ్ మానసిక సమస్యలతో ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రత్యేక దర్యాప్తు దళం (సిట్) దర్యాప్తులో తేలింది. ఆదాయ పన్నుల శాఖ అధికారుల ఒత్తిళ్లకే ఆయన ఆత్మహత్య చేసుకున్నారనే అనుమానాలు వ్యక్తమైన నేపథ్యంలో ప్రభుత్వం ఈ సంఘటనను తీవ్రంగా పరిగణించి సిట్ ఏర్పాటు చేసి, దర్యాప్తు చేపట్టింది. ఈ దర్యాప్తులో కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయి. మానసిక సమస్యలతో సతమతమవుతూ ఆయన కొన్నేళ్లుగా వైద్య సేవలూ పొందుతున్నట్లు తేలింది. మధ్యలో వైద్యసేవలు మానివేయడమూ సమస్య తీవ్రత పెంచినట్లు అనుమానిస్తున్నారు. ఆ బాధలు భరించలేని స్థితిలోనే ఆయన ఆత్మహత్య చేసుకున్నట్లు న్యాయస్థానంలో సిట్ ఛార్జిషీట్ దాఖలు చేయాలని నిర్ణయించింది. ల్యాంగ్ ఫోర్డ్ టౌన్ రిచ్‌మెండ్ రహదారిలోని కార్యాలయంలో జనవరి 30న ఆదాయ పన్ను శాఖ అధికారులు విచారించే సమయంలోనే సీజే రాయ్ తన గదిలోకి వెళ్లి కాల్చుకుని



ఆత్మహత్య చేసుకున్నట్లు కేసు నమోదైన విషయం తెలిసిందే.

## అలా వ్యాజ్యాలు వేసే కంటే.. మీ వృత్తిపై శ్రద్ధ పెట్టండి : సుప్రీం కోర్టు

దేశంలోని పలు అంశాలపై 25 ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు దాఖలు చేసిన ఓ న్యాయవాదిపై సుప్రీంకోర్టు అసహనం వ్యక్తంచేసింది. కోర్టులో వ్యాజ్యాలు దాఖలు చేయడం కంటే తొలుత సంబంధిత అధికారులను సంప్రదించాలని సర్వోన్నత న్యాయస్థానం పిటిషనర్‌కు సలహా ఇచ్చింది. "మీరు మీ వృత్తిపై శ్రద్ధ పెట్టండి. కోర్టులో పిల్ దాఖలు చేయడానికంటే ముందే సంబంధిత అధికారులను సంప్రదించండి. పిల్ వేయదలచుకున్న పిటిషనర్‌కు అవి ఎలా పరిష్కరించాలో అంచనా వేయగలిగే శక్తి కూడా ఉండాలి. ఒకవేళ సమస్య పరిష్కారం కాకపోతే అప్పుడు కోర్టును ఆశ్రయించాలి" అని పిటిషనర్ సచిన్ గుప్తాకు ధర్మాసనం సూచించింది.

## భర్త నల్లగా ఉన్నాడని ప్రియుడితో చంపించిన భార్య

ధార్ (మధ్యప్రదేశ్), ఏప్రిల్ 10: 'నువ్వు నల్లగా ఉన్నావు.. నాకు సరిపోవు. నీకంటే మెరుగైన వ్యక్తి నాకు దక్కాలి' అంటూ ఓ మహిళ ప్రియుడితో కలిసి భర్తను కిరాతకంగా హత్య చేయించింది. ఈ ఉదంతం మధ్యప్రదేశ్‌లోని ధార్‌లో చోటుచేసుకుంది. హత్య అనంతరం తన ఇంట్లో దోపిడీ జరిగిందని, దొంగలు ఆమె భర్తను హత్య చేశారని సినిమా రేంజ్‌లో కథ అల్లింది. చివరకు దర్యాప్తులో అసలు విషయం బయటపడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మధ్యప్రదేశ్‌లోని ధార్‌కి చెందిన దేవకృష్ణ పురోహిత్(28) సుగంధ ద్రవ్యాల వ్యాపారం చేసేవాడు. ఏప్రిల్ 7న తన సొంత ఫ్లాట్‌లోనే హత్యకు గురయ్యాడు. మృతదేహంపై పదునైన ఆయుధంతో దాడి చేసిన గాయాలున్నాయి. అయితే, మృతుడి భార్య ప్రియాంక పురోహిత్ మాత్రం గుర్తుతెలియని దొంగలు ఇంట్లోకి చొరబడి విలువైన వస్తువులతో పాటు రూ.3.5లక్షలు దొంగిలించి, తన భర్తను హత్య చేశారని పోలీసులకు చెప్పింది. అనుమానం వచ్చిన పోలీసులు లోతుగా దర్యాప్తు చేయగా అసలు విషయం బయటకు వచ్చింది. ఎన్నో వివాదాల మధ్య దేవకృష్ణ, ప్రియాంక కు ఇటీవలే



వివాహం జరిగిందని వారి కుటుంబసభ్యులు తెలిపారు. 'నువ్వు నల్లగా ఉన్నావు. నువ్వు నాకు సరితూగవు. నీకంటే మెరుగైన వ్యక్తి, అందగాడు నాకు దక్కాలి' అంటూ ప్రియాంక తరచూ భర్తను అవమానించేదని మృతుడి సోదరి తెలిపినట్లు పోలీసులు పేర్కొన్నారు.

**సుపారీగా రూ.లక్ష ఇచ్చేందుకు..**

"ప్రియాంక ఆమె ప్రియుడు కమలేశ్‌కు సన్నిహితుడైన సురేంద్రభట్‌తో కలిసి దేవకృష్ణను హత్య చేయాలని ప్రణాళిక రచించారు. ఈ క్రమంలోనే అతడికి రూ.లక్ష సుపారీ ఇచ్చేందుకు మాట్లాడుకున్నారు. అడ్వాన్స్‌గా రూ.50 వేలు చెల్లించారు. హత్యలా కాకుండా దొంగతనంలా ఉండాలని ప్లాన్ చేసి తలుపులు పగలగొట్టి లోపల నిద్రిస్తున్న దేవకృష్ణపై సురేంద్ర పదునైన ఆయుధంతో దాడి చేశాడు. ముగ్గురూ కలిసి ఇంట్లో విలువైన వస్తువులను మాయం చేశారు. ఆ తర్వాత ప్రియాంక ఒంటిపై ఉన్న నగలను కూడా మాయం చేసి, బాధితురాలిగా చూపించుకునేందుకు తన చేతులను తాళ్లతో కట్టేసుకుంది. హత్య జరిగిన ఫ్లాట్‌లో దర్యాప్తు చేస్తున్నప్పుడు ఆమె నగలు దొరకడంతో అనుమానం మొదలైంది. ఆ కోణంలో దర్యాప్తు చేయగా ప్రియాంక పొంతన లేకుండా సమాధానం ఇవ్వడంతో అనుమానాలు బలపడ్డాయి. దీంతో దర్యాప్తు ముమ్మరం చేయడంతో అసలు విషయం బయటపడింది. కమలేశ్, ప్రియాంకలను అదుపులోకి తీసుకున్నాం. సురేంద్ర పరారీలో ఉన్నాడు. కేసు నమోదు చేసి తదుపరి విచారణ చేపట్టాం" అని పోలీసులు పేర్కొన్నారు.



# నేరేడు పళ్ళు.. ఆరోగ్యానికి మేలు

నేరేడు పండు.. దీన్ని జావా ప్లం, సిజిజియం క్యుమిని అని కూడా పిలుస్తుంటారు. ఇది ఎంతో రుచికరంగా ఉంటుంది. అంతేకాదు ఆరోగ్యానికి కూడా ఎంతో మంచింది. ఈ చిన్న, ముదురు ఊదా రంగు పండు యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు, ఖనిజాలతో సమృద్ధిగా ఉంటుంది. ఆరోగ్యంగా ఉండాలనుకునేవారికి ఇది చాలా బాగా పనిచేస్తుంది. నేరేడు పండ్లు తింటే మనకు ఎలాంటి ప్రయోజనాలు ఉంటాయి, అసలు దీన్ని ఎందుకు తినాలో ఓ సారి చూద్దాం.

### యాంటీఆక్సిడెంట్ పవర్హౌస్...

బ్లాక్ జామున్‌లోని ముఖ్య ప్రయోజనాల్లో ఒకటి దాని అధిక యాంటీఆక్సిడెంట్ కంటెంట్. యాంటీఆక్సిడెంట్లు ఫ్రీ రాడికల్స్ నుండి శరీరాన్ని రక్షించడంలో సహాయపడతాయి. ఇవి కణాలకు నష్టం కలిగించే హానికరమైన అణువులు. క్యాన్సర్, గుండె జబ్బులతో సహా వివిధ ఆరోగ్య సమస్యలకు దారితీస్తాయి. ఇందుకోసం నేరేడు పండులోని ఆంథోసైనిన్లు, ఎల్లాజిక్ ఆమ్లం, టానిన్లు వంటి యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి శరీరంలో ఆక్సీకరణ ఒత్తిడి, వాపుతో పోరాడటానికి సహాయపడతాయి.

### రక్తంలో చక్కెర నియంత్రణ...

నేరేడు పండ్ల అత్యంత ముఖ్యమైన ప్రయోజనాల్లో ఒకటి రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడే సామర్థ్యం. ఈ పండు రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను తగ్గించడానికి, ఇన్సులిన్ సున్నితత్వాన్ని మెరుగుపరచడానికి సహాయపడుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి. ఇది డయాబెటిస్ లేదా ప్రీడయాబెటిస్ ఉన్నవారికి ఆహారంలో విలువైన సహాయకులుగా ఉంటుంది. పండ్లలోని యాంటీఆక్సిడెంట్లు డయాబెటిక్ న్యూరోపతి, మూత్రపిండాల నష్టం వంటి అధిక రక్తంలో చక్కెరకు సంబంధించిన సమస్యల నుండి రక్షించడానికి కూడా ఎంతో సహాయపడతాయి.

### విటమిన్లు, ఖనిజాలు సమృద్ధిగా...

నల్ల జామున్ మొత్తం ఆరోగ్యానికి అవసరమైన విటమిన్లు, ఖనిజాలకు కూడా గొప్ప మూలం. ఇందులో విటమిన్ సి అధికంగా ఉంటుంది, ఇది రోగనిరోధక శక్తిని పెంచుతుంది. ఇంకా ఆరోగ్యకరమైన చర్మాన్ని ప్రోత్సహిస్తుంది. ఈ పండులో విటమిన్ ఎ కూడా ఉంటుంది, ఇది మంచి దృష్టికి ముఖ్యమైనది. విటమిన్ బి 6 ఇది మెదడు పనితీరు, జీవక్రియకు మద్దతు ఇస్తుంది. వీటితోపాటు పొటాషియం, కాల్షియం, ఇనుము వంటి ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి, ఇవి సరైన కండరాల పనితీరు, ఎముక ఆరోగ్యం, ఎర్ర రక్త కణాల ఉత్పత్తికి అవసరం.

# అలోవెరా లాభాలు భళా..!



అలోవెరా.. ఔషధ లక్షణాల కోసం చాలామంది దీన్ని ఉపయోగిస్తుంటారు. కలబందను తినడానికి అత్యంత పాపులర్ పొందిన మార్గాలలో ఒకటి రసం రూపంలో ఉంటుంది. అలోవెరా రసం అనేక పోషకాలతో నిండి ఉంటుంది. అలాగే అనేక రకాల ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉంటుంది. ఇందులో పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. అలోవెరా రసంలో మంచి ఆరోగ్యానికి అవసరమైన విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇందులో విటమిన్లు ఎ, సి, ఇ, బి విటమిన్లతో పాటు కాల్షియం, మెగ్నీషియం, పొటాషియం వంటి ఖనిజాలు ఉంటాయి. ఈ పోషకాలు రోగనిరోధక వ్యవస్థను పెంచడానికి, జీర్ణక్రియను మెరుగుపరచడానికి ఎంతగానో సహాయపడతాయి. ఇక కలబంద రసం మీ ఆరోగ్యానికి ఎందుకు మంచిదో ఓ సారి చూద్దాం.

### జీర్ణక్రియకు సహాయపడుతుంది...

అలోవెరా రసం జీర్ణవ్యవస్థను ఉపశమనం చేసే సామర్థ్యానికి ప్రసిద్ధి చెందింది. ఇది అజీర్ణం, ఉబ్బరం, మలబద్ధకం లక్షణాల నుండి ఉపశమనం పొందడానికి సహాయపడుతుంది. అలోవెరా రసంలో యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు కూడా ఉన్నాయి. ఇవి పేగుల్లో మంటను తగ్గించడానికి అలాగే జీర్ణక్రియను మెరుగుపరచడానికి సహాయపడతాయి.

### శరీరాన్ని నిర్విషీకరణ చేస్తుంది...


కలబంద రసం సహజమైన నిర్విషీకరణగా పనిచేస్తుంది. శరీరం నుండి విషాన్ని అలాగే మలినాలను తొలగించడానికి సహాయపడుతుంది. ఇది కాలేయం, మూత్రపిండాలను శుభ్రపరచడానికి మొత్తం నిర్విషీకరణను ప్రోత్సహించడానికి ఇంకా ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి సహాయపడుతుంది.

### చర్మ ఆరోగ్యానికి తోడ్పడుతుంది...

కలబంద రసాన్ని అంతర్గతంగా తీసుకుంటే ప్రయోజనకరంగా ఉండటమే కాకుండా.., సమయోచితంగా అప్లై చేస్తే చర్మానికి అద్భుతమైన ప్రయోజనాలను అందిస్తుంది. ఇది గాయాలను నయం చేయడానికి, వాపును తగ్గించడానికి అలాగే కొల్లాజెన్ ఉత్పత్తిని ప్రోత్సహించడానికి సహాయపడుతుంది. కలబంద రసం తాగడం వల్ల చర్మం ఆరోగ్యాన్ని లోపలి నుండి మెరుగుపరచడంలో సహాయపడుతుంది.

### రోగనిరోధక శక్తిని పెంచుతుంది...

కలబంద రసంలో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచడానికి, హానికరమైన ఫ్రీ రాడికల్స్ నుండి శరీరాన్ని రక్షించడానికి సహాయపడతాయి. కలబంద రసాన్ని క్రమం తప్పకుండా తీసుకోవడం అనారోగ్యాన్ని నివారించడానికి అలాగే ఆరోగ్యంగా, శక్తివంతంగా ఉంచడానికి సహాయపడుతుంది.




# మీ ఆరోగ్యానికి ఏది మంచిది?

# టీ.. లేదా కాఫీ?

టీ లేదా కాఫీ లేనిది చాలా మందికి రోజు గడవదు. ఉదయం నిద్రలేవగానే టీ, కాఫీ తాగితేనే వారికి హాయిగా ఉంటుంది. కొందరికి ఒక్కపూట టీ, కాఫీ తాగకపోతే తలబద్ధలై పోయినట్లువుతుంది. కాగా, కొందరు టీ తాగడానికి ఇష్టపడుతుండగా.. మరి కొంతమంది కాఫీ తాగడానికి ఇష్టపడుతుంటారు. కానీ ఈ రెండింటిలో ఏదీ మన ఆరోగ్యానికి మంచిదని చాలా మందికి తెలియదు. టీ, కాఫీలో ఏది తాగడం వల్ల మన శరీరానికి ఆరోగ్యంగా పనిచేస్తుందని విషయానికి ఎప్పటికప్పుడు పలు అధ్యయనాలు వెల్లడిస్తూనే ఉన్నాయి. అసలు మన శరీర సంబంధించి ఏది తాగాలో ఒకసారి చూద్దామా..

### టీ.. ఓ ఆరోగ్యకరమైన ఎంపిక...

టీ, ముఖ్యంగా గ్రీన్ టీ దాని అనేక ఆరోగ్య ప్రయోజనాలకు చాలాకాలంగా వింటూనే ఉన్నాము. యాంటీఆక్సిడెంట్లతో నిండిన టీ జీవక్రియను పెంచుతుంది. అలాగే జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఇంకా గుండె జబ్బుల ప్రమాదాన్ని కూడా తగ్గిస్తుంది. టీలో కనిపించే క్యాటెచిన్లు బరువు తగ్గడం, మెదడు పనితీరును మెరుగుపరచడంతో ముడిపడి ఉన్నాయి. వీటితోపాటు ఇంకా టీ అనేది ఆర్ద్రీకరణకు గొప్ప మూలం. అలాగే మనస్సును శాంతపరచడాని, ఒత్తిడిని తగ్గించడానికి ఇది ఎంతగానో సహాయపడుతుంది.





### కాఫీ.. ఓ వివాదాస్పద ఎంపిక...

ఇక ఆరోగ్యం విషయానికి వస్తే.. కాఫీకి కొంచెం మిశ్రమ పేరు ఉంది. కాఫీ త్వరగా శక్తిని అందించి, దృష్టిని మెరుగుపరుస్తుందనేది నిజం అయినప్పటికీ.. అధిక వినియోగం నిద్రలేమి, ఆందోళనలతోపాటు హృదయ స్పందన రేటు పెరగడం వంటి సమస్యలతో ముడిపడి ఉంది. అయితే, కాఫీలో యాంటీఆక్సిడెంట్లు కూడా ఉంటాయి. అలాగే అల్జీమర్స్, పార్కిన్సన్స్ వంటి కొన్ని వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది.

### మీ ఆరోగ్యానికి ఏది మంచిది...?

అంతిమంగా.. టీ, కాఫీ మధ్య ఎంపిక వ్యక్తిగత ప్రాధాన్యత. ప్రతి పానీయం మీ శరీరాన్ని ఎలా ప్రభావితం చేస్తుందనే దానిపై ఆధారపడి ఉంటుంది. మీరు కెఫిన్ పట్ల సున్నితంగా ఉంటే లేదా నిద్రపోవడంలో ఇబ్బంది ఉంటే 'టీ' మీకు మంచి ఎంపిక కావచ్చు. మరోవైపు, మీకు త్వరితగతిన కాఫీని తీసుకోవాలనుకుంటే లేదా కాఫీ రుచిని ఆస్వాదించాలనుకుంటే, మితంగా సేవించినప్పుడు అది ఆరోగ్యకరమైన జీవనశైలిలో భాగంగా ఉంటుంది.



## మళ్లీ లాభాల్లోకి స్టాక్ మార్కెట్లు..

### 918 పాయింట్లు లాభపడ్డ సెన్సెక్స్



**ముంబై:** ఒకరోజు విరామానికి తెరదించుతూ దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం మళ్లీ లాభాల బాటపట్టాయి. పశ్చిమాసియాలో చోటుచేసుకుంటున్న పరిణామాలను ఇన్వెస్టర్లు నిశితంగా గమనిస్తున్నప్పటికీ.. దేశీయంగా కొనుగోళ్ల మద్దతు కొనసాగడంతో సూచీలు భారీ లాభాలతో ముగిశాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 918.6 పాయింట్లు పెరిగి 77,550.25 వద్ద స్థిరపడింది. నిఫ్టీ కూడా 275.5 పాయింట్లు లాభపడి 24,050.6 వద్ద ముగిసింది.

ట్రేడింగ్‌లో ఒక దశలో సెన్సెక్స్ 77,622.50, నిఫ్టీ 24,074.05 వద్ద ఇంట్రాడే గరిష్ఠాలను తాకాయి. ఏషియన్ పెయింట్స్, ఐషర్ మోటార్స్, బజాజ్ ఆటో, శ్రీరామ్ ఫైనాన్స్ వంటి హెవీ వెయిట్ షేర్లు లాభపడటం సూచీల పెరుగుదలకు దోహదపడింది. బెంచ్‌మార్క్ సూచీలను మించి బ్రాడర్ మార్కెట్లు రాణించడం గమనార్హం. నిఫ్టీ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 1.48 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 1.67 శాతం చొప్పున లాభపడ్డాయి.

రంగాల వారీగా చూస్తే మిశ్రమ ప్రదర్శన కనబరిచాయి. ఐటీ షేర్లలో కొనుగోళ్ల ఆసక్తి పెరగడంతో నిఫ్టీ ఐటీ సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. మరోవైపు నిఫ్టీ ఆటో, బ్యాంక్, ఫైనాన్షియల్ సర్వీసెస్ సూచీలు మిగిలిన వాటితో పోలిస్తే వెనుకబడ్డాయి. ఉదయం సెషన్ ప్రారంభంలో కూడా ప్రపంచ మార్కెట్ల సానుకూల సంకేతాలతో సూచీలు లాభాలతోనే మొదలయ్యాయి.

## యూపీఐకి పదేళ్లు.. లావాదేవీల్లో 12,000 రెట్ల అసాధారణ వృద్ధి




**న్యూఢిల్లీ:** భారత డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ఏప్రిల్ 11తో పదేళ్లు పూర్తి చేసుకోనుంది. ఈ దశాబ్ద కాలంలో లావాదేవీల పరిమాణంలో 12,000 రెట్లు, విలువ పరంగా 4,000 రెట్లకు పైగా అసాధారణ వృద్ధిని నమోదు చేసి సరికొత్త చరిత్ర సృష్టించింది.

2016-17 ఆర్థిక సంవత్సరంలో కేవలం 1.78 కోట్ల లావాదేవీలతో (విలువ రూ. 6,952 కోట్లు) మొదలైన యూపీఐ ప్రస్థానం.. 2025-26 నాటికి 21,898 కోట్ల లావాదేవీలకు (విలువ దాదాపు రూ. 285 లక్షల కోట్లు) చేరింది. ముఖ్యంగా కరోనా మహమ్మారి తర్వాత డిజిటల్ చెల్లింపుల వినియోగం విపరీతంగా పెరగడంతో యూపీఐ వృద్ధి అమాంతం పెరిగింది. మర్చంట్ క్యూఆర్ కోడ్‌లు, పాయింట్ ఆఫ్ సేల్ టెర్మినల్స్ సంఖ్య కూడా భారీగా పెరిగింది.

ఇటీవల మార్చి 2026లో యూపీఐ తన ఆల్ టైమ్ రికార్డును నమోదు చేసింది. ఆ నెలలో ఏకంగా 22.64 బిలియన్ల లావాదేవీలు జరిగాయి. యూపీఐ ప్రారంభమైనప్పటి నుంచి ఒకే నెలలో ఇన్ని లావాదేవీలు జరగడం ఇదే తొలిసారి. గతేడాది మార్చితో పోలిస్తే ఇది 24 శాతం అధికం. ప్రస్తుతం ఒక నెలలో జరుగుతున్న యూపీఐ లావాదేవీల విలువ (సుమారు రూ. 28 లక్షల కోట్లు) దేశంలో చలామణిలో ఉన్న మొత్తం కరెన్సీలో దాదాపు 70 శాతానికి సమానంగా ఉండటం గమనార్హం. ఇది నగదుకు ప్రత్యామ్నాయంగా డిజిటల్ చెల్లింపులు ఎంత బలంగా మారాయో స్పష్టం చేస్తోంది.

## మళ్లీ తెరపైకి టాటా సన్స్ వ్యవహారం..

### లిస్టింగ్‌కు జైకొట్టిన ఎస్‌పీ గ్రూప్




**న్యూఢిల్లీ:** టాటా సన్స్ లిస్టింగ్ వ్యవహారం మళ్లీ తెరమీదకు వచ్చింది. దీన్ని లిస్టింగ్ చేయాలా? వద్దా? అనే అంశంపై టాటా గ్రూప్‌లో ఉన్న అభిప్రాయభేదాలు మరోసారి బయటపడ్డాయి. ఇప్పటికే టాటా ట్రస్ట్స్ ట్రస్టీ అయిన వేణు శ్రీనివాసన్ లిస్టింగ్‌కు బహిరంగంగా మద్దతు పలకగా.. మొదటి నుంచీ ఈ విషయంలో అనుకూలంగా ఉన్న షాపూర్జీ పల్లోంజీ గ్రూప్ లిస్టింగ్‌కు జైకొట్టింది. దీంతో ప్రస్తుతం ఈ బంతి ఆర్‌బీఐ కోర్టులో పడింది.

టాటా సన్స్‌ను సకాలంలో లిస్టింగ్ చేయడం అనేది కేవలం నియంత్రణ సంస్థల నిబంధన మాత్రమే కాదని, అది ఒక అవసరమని షాపూర్జీ పల్లోంజీ గ్రూప్ ఛైర్మన్ షాపూర్జీ పల్లోంజీ మిస్త్రీ పేర్కొన్నారు. ఇది కార్పొరేట్ పాలనను బలోపేతం చేసి, పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంచుతుందన్నారు. ఇవే టాటా గ్రూప్‌కు మూలస్తంభాలు అని పేర్కొన్నారు. లిస్టింగ్ ద్వారా రిటైల్ పెట్టుబడిదారులకు మేలు జరుగుతుందన్నారు. టాటా ట్రస్ట్‌లకు స్థిరమైన డివిడెండ్ ఆదాయం లభిస్తుందని, తద్వారా వారు మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టవచ్చని మిస్త్రీ అభిప్రాయపడ్డారు. ఈ విషయంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి స్పష్టమైన దిశానిర్దేశం కోసం తాము ఎదురుచూస్తున్నామని ఆయన చెప్పారు.

టాటా సన్స్‌ను అప్పర్ లేయర్ నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీగా ఆర్‌బీఐ గుర్తించింది. దీని ప్రకారం టాటా సన్స్‌ను లిస్ట్ చేయాల్సి ఉంటుంది. టాటా సన్స్‌లో మెజారిటీ వాటా కలిగిన (66 శాతం) టాటా ట్రస్ట్స్‌కు లిస్టింగ్ చేయడం ఏమాత్రం ఇష్టం లేదు. టాటా ట్రస్ట్స్ లిస్టింగ్ వల్ల సంస్థపై ట్రస్ట్ నియంత్రణ తగ్గి, బయటి వ్యక్తుల జోక్యం పెరుగుతుందనేది ట్రస్ట్ ఛైర్మన్ నోయల్ టాటా, మరికొందరు ట్రస్టీల ఆందోళన. అయితే, షాపూర్జీ పల్లోంజీ గ్రూప్ మాత్రం మొదటి నుంచీ లిస్టింగ్‌కు అనుకూలంగా ఉంది. తీవ్ర ఆర్థిక ఒత్తిళ్లలో ఉన్న ఈ గ్రూప్.. టాటా సన్స్‌లో తనకున్న 18.37% వాటాలను తనఖా పెట్టింది. వాటిని విడిపించుకోవడానికి టాటా సన్స్ లిస్టింగ్ కోసం ఒత్తిడి తెస్తోంది. అయితే, అప్పర్ లేయర్ ఎన్‌బీఎఫ్‌సీకి సంబంధించి ఆర్‌బీఐ త్వరలో సవరించిన సర్క్యులర్‌ను జారీ చేయనుంది. కంపెనీ విజ్ఞప్తిని దృష్టిలో పెట్టుకుని మినహాయింపు ఇస్తుందా? లేదా లిస్టింగ్ చేయాల్సిందేనని చెబుతుందా? అనేది వేచి చూడాలి.

# 'వైభవో'పేత విజయం..

### ఆర్సీబీపై రాజస్థాన్ ఘన విజయం



**గువాహటి:** ఐపీఎల్ 2026లో భాగంగా గువాహటి వేదికగా జరిగిన మ్యాచ్‌లో ఆర్సీబీపై రాజస్థాన్ రాయల్స్ 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. బెంగళూరు నిర్దేశించిన 202 పరుగుల లక్ష్యాన్ని రాజస్థాన్ 18 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఓపెనర్ వైభవ్ (78; 26 బంతుల్లో 8 ఫోర్లు, 7 సిక్స్‌లు) సంచలన ఇన్నింగ్స్ ఆడాడు. జురెల్ (81౽; 43 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్స్‌లు) రాణించాడు. జడేజా 24౽ పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. జైస్వాల్ (13), రియాన్ పరాగ్(3), హెట్‌మయర్ (0) బ్యాటింగ్‌లో విఫలమయ్యారు. లక్ష్యఛేదనలో వైభవ్ ఔటైన తర్వాత రాజస్థాన్ ఓ దశలో తడబడింది. అయితే.. ధ్రువ్‌జురెల్ క్రీజులో పాతుకుపోవడంతో చివరికి విజయం సాధించింది. ఆర్సీబీ బౌలర్లలో కృనాల్ పాండ్య, హేజెల్‌వుడ్ రెండేసి వికెట్లు తీశారు. మిగతా బౌలర్లు విఫలమయ్యారు.



అంతకు ముందు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు బ్యాటర్లలో రజత్ పాటిదార్ (63; 40 బంతుల్లో, 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) హాఫ్ సెంచరీతో కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడాడు. విరాట్ కోహ్లి (32; 16 బంతుల్లో 7 ఫోర్లు), వెంకటేశ్ అయ్యర్ (29౽; 15 బంతుల్లో, 1 ఫోర్, 2 సిక్స్‌లు) రొమారియో షెఫర్డ్ (22; 11 బంతుల్లో, 2 ఫోర్లు, 1 సిక్స్) ఫర్వాలేదనిపించారు. ఫిల్ సాల్ట్ (0), దేవ్‌దత్ పడిక్కల్ (14), కృనాల్ పాండ్య (1) జితేశ్ శర్మ (5), టిమ్ డేవిడ్ (13) బ్యాటింగ్‌లో విఫలమయ్యారు. రాజస్థాన్ బౌలర్లలో జోఫ్రా ఆర్చర్, రవిబిష్ణోయ్, బ్రిజేశ్ శర్మ తలో 2 వికెట్లు పడగొట్టారు. సందీప్ శర్మ, జడేజా చెరో వికెట్ తీశారు.

## ఐపీఎల్‌కు దూరమైన మిస్టరీ స్పిన్నర్..




### సఫారీ ఆల్‌రౌండర్‌కు జాక్‌పాట్..!

**న్యూఢిల్లీ:** పంతొమ్మిదో సీజన్‌లో వరసగా రెండు విజయాలతో జోరుమీదున్న లక్నో సూపర్ జెయింట్స్‌కు బిగ్ షాక్. గాయంతో బాధ పడుతున్న వనిందు హసరంగ మెగా టోర్నీకి దూరమయ్యాడు. శ్రీలంక వెటరన్ పంతొమ్మిదో సీజన్ ఆడడం లేదని ఎల్ఎస్‌జీ డైరెక్టర్ ఆఫ్ క్రికెట్ టామ్ మూడీ వెల్లడించారు. హసరంగ స్థానంలో దక్షిణాఫ్రికా యువకెరటం జార్జ్ లిండేను తీసుకున్నామని ఆయన తెలిపాడు.

శ్రీలంక మాజీ కెప్టెన్ వనిందు హసరంగ ఐపీఎల్‌కు దూరమయ్యాడు. ఇటీవల పొట్టి ప్రపంచకప్‌లో గాయపడిన ఈ మిస్టరీ స్పిన్నర్ పూర్తిగా కోలుకోలేదు. దాంతో, అతడు శ్రీలంక బోర్డు నిర్దేశించిన ఫిట్‌నెస్ ప్రమాణాలను అందుకొని.. ఐపీఎల్ ఆడే అవకాశాలు కనిపించడం లేదు. కాబట్టి పంతొమ్మిదో సీజన్‌కు తాను అందుబాటులో ఉండడంపై లక్నో యాజమాన్యానికి హసరంగ హామీ ఇవ్వలేకపోతున్నాడు. ఈ నేపథ్యంలో అతడి బదులు జార్జ్ లిండేను తీసుకుంది లక్నో.

'ఈ సీజన్‌కు హసరంగ అందుబాటులో ఉ ండడనే విషయాన్ని మేము అర్థం చేసుకుంటున్నాం. అతడి స్థానంలో దక్షిణాఫ్రికా ఆల్‌రౌండర్ జార్జ్ లిండేను తీసుకున్నాం' అని టామ్ మూడీ వెల్లడించాడు. నిరుడు అబుధాబీలో జరిగిన మినీ వేలంలో హసరంగను రూ.2 కోట్లకు దక్కించుకుంది లక్నో. కానీ, టీ20 ప్రపంచకప్‌లో తొడ కండరాల గాయంతో అతడు క్రికెట్‌కు దూరమయ్యాడు. ఐపీఎల్‌లోపైనా కోలుకుంటాడని ఆశించిన లక్నోకు నిరాశే మిగిలింది. ఓటమితో పంతొమ్మిదో సీజన్‌ను ఆరంభించిన లక్నో సూపర్ జెయింట్స్ వరసగా విజయాలతో జోరందుకుంది. సన్‌రైజర్స్ హైదరాబాద్, కోల్‌కతా నైట్ రైడర్స్‌పై ఆఖరి ఓవర్ థ్రిల్లర్‌లో గెలుపొందిందింది లక్నో. ప్రస్తుతం దిగ్వేశ్ రథీ, సిద్దార్థ్, షహబాజ్ అహ్మద్, జార్జ్ లిండేలతో లక్నో స్పిన్ దళం పటిష్టంగానే ఉంది.

## నీవు నా కొడుకు కెరీర్ ముగించేశావు

### క్రిస్ బ్రాడ్ ఆవేదన.. యువీ రియాక్షన్!



**న్యూఢిల్లీ:** 2007 టీ20 ప్రపంచకప్‌లో యువరాజ్ సింగ్ ఒకే ఓవర్లో ఆరు సిక్సర్ల విధ్వంసం క్రికెట్ చరిత్రలో ఒక అద్భుతం. అయితే ఆ ఘటన తర్వాత మైదానం వెలుపల జరిగిన కొన్ని ఆసక్తికరమైన విషయాలను యువీ ఇటీవల 'ది ఓవర్ లాప్' షోలో పంచుకున్నాడు. ఆ సిక్సర్ల వర్షం స్టువర్ట్ బ్రాడ్ కెరీర్‌పై ఎలాంటి ప్రభావం చూపిందో, అతని తండ్రి క్రిస్ బ్రాడ్ ఎలా స్పందించారో యువీ వివరించాడు.

ఆ మ్యాచ్‌కు రిఫరీగా ఉన్న స్టువర్ట్ బ్రాడ్ తండ్రి క్రిస్ బ్రాడ్ మ్యాచ్ ముగిశాక యువరాజ్ వద్దకు వచ్చి, "నువ్వు దాదాపు నా కొడుకు కెరీర్‌ను ముగించేశావు" అని అన్నారట. ఒక తండ్రిగా తన కొడుకు పడుతున్న బాధను ఆయన అలా వ్యక్తం చేశారు. దానికి యువీ స్పందిస్తూ.. "సర్, గతంలో నా బౌలింగ్‌లో కూడా ఐదు సిక్సర్లు పడ్డాయి, ఆ బాధ నాకు తెలుసు" అని ఆయనను ఓదార్చే ప్రయత్నం చేశాడు.

ఆ తర్వాత క్రిస్ బ్రాడ్ కోరిక మేరకు ఒక జెర్సీపై యువీ సంతకం చేస్తూ.. "నువ్వు భవిష్యత్తులో ప్రపంచంలోనే అత్యుత్తమ బౌలర్‌గా ఎదుగుతావని ఆశిస్తున్నాను" అని రాసిచ్చాడు. అయితే, ఆ జెర్సీని స్టువర్ట్ బ్రాడ్ కోపంతో డస్ట్‌బిన్‌లో పడేశాడని యువీకి ఇటీవల తెలిసింది. "అంతటి అవమానం జరిగినప్పుడు ఆ కోపం రావడం సహజమే, అది తప్పు కాదు" అని యువీ చాలా పరిణతితో స్పందించాడు. ఆ ఎదురుదెబ్బతో కుంగిపోకుండా బ్రాడ్ 600 పైగా టెస్ట్ వికెట్లు తీసి లెజెండరీ బౌలర్‌గా ఎదగడం గొప్ప విషయమని యువీ కొనియాడాడు.

## మూడో సీడ్‌పై ఆయుశ్

# అదిరే విజయం..

### భారత పతక ఆశలు సజీవం..!




**చైనా:** చైనా వేదికగా జరుగుతున్న బ్యాడ్మింటన్ ఆసియా ఛాంపియన్‌షిప్స్‌లో భారత యువ షట్లర్ ఆయుష్ శెట్టి చెలరేగుతున్నాడు. సీనియర్లు చేతులెత్తేసిన చోట తన దూకుడైన ఆటతో ప్రత్యర్థులను మట్టికరిపిస్తున్న ఆయుశ్ సెమీఫైనల్‌కు దూసుకెళ్లాడు. పురుషుల సింగిల్స్‌లో అదుర్స్ అనిపిస్తున్న భారత కుర్రాడు క్వార్టర్స్‌లో మూడో సీడ్ సీడ్ జోనాథన్ క్రిస్టీ(ఇండోనేషియా)ను ఓడించాడు. అద్భుత విజయంతో సెమీస్ చేరిన ఆయుశ్ పతకంపై ఆశలు రేపుతున్నాడు.

బ్యాడ్మింటన్ ఆసియా ఛాంపియన్‌షిప్స్ పురుషుల సింగిల్స్‌లో ఆయుశ్ శెట్టి జైత్రయాత్ర కొనసాగుతోంది. తొలి రౌండ్‌లోనే ఏడో ర్యాంకర్ చైనా ఆటగాడిని ఇంటికి పంపిన ఆయుశ్ అదే ఊపులో 25వ ర్యాంకరైన చీ యూ జెన్(చైనీస్ తైపీ)ను వణికించాడు. క్వార్టర్స్‌లోనూ జోరు చూపించిన భారత షట్లర్ జొనాథన్ క్రిస్టీకి చెక్ పెట్టాడు.

హోరాహోరీగా జరిగిన తొలి సెట్‌ను 23-21తో గెలుచుకున్న ఆయుశ్ రెండో సెట్‌లో ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశమివ్వలేదు. 21-17తో మ్యాచ్ ముగించి సెమీస్ పోరుకు సిద్ధమయ్యాడు. తద్వారా ఈ మెగా టోర్నీలో భారత పతక ఆశలను సజీవంగా ఉంచాడీ యంగ్‌స్టర్. సీనియర్లు హెచ్‌హెస్ ప్రణయ్, పీవీ సింధులు ఇప్పటికే టోర్నీ నుంచి

MOVIE TIME

## మైఖేల్ జాక్సన్ బయోపిక్ ట్రైలర్ విడుదల



**టాకీస్:** ప్రపంచవ్యాప్తంగా సంగీత ప్రియులు ఎంతగానో ఎదురుచూస్తున్న పాప్ రారాజు మైఖేల్ జాక్సన్ బయోపిక్ 'మైఖేల్' ఫైనల్ ట్రైలర్‌ను చిత్రయూనిట్ తాజాగా విడుదల చేసింది . ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో మైఖేల్ జాక్సన్ మేనల్లుడు జాఫర్ జాక్సన్ టైటిల్ రోల్ పోషిస్తుండగా, ట్రైలర్‌లో ఆయన బాడీ లాంగ్వేజ్, డ్యాన్స్ మూమెంట్స్ మరియు లుక్ అచ్చం మైఖేల్ జాక్సన్‌ను తలపిస్తుండటం విశేషం. దర్శకుడు ఆంటోయిన్ ఫుక్వా తెరకెక్కించిన ఈ ట్రైలర్‌లో 'బీట్ ఇట్', 'థ్రిల్లర్', 'బిల్లీ జీన్' వంటి ఐకానిక్ సాంగ్స్ ప్రదర్శనలతో పాటు, మైఖేల్ వ్యక్తిగత జీవితంలోని భావోద్వేగ అంశాలను, బాల్యంలో ఆయన ఎదుర్కొన్న సంఘర్షణలను మరియు వివాదాలను ఎంతో ఆకట్టుకునేలా చూపించారు. ఆస్కార్ విజేత గ్రాహమ్ కింగ్ నిర్మించిన ఈ చిత్రంలో కోల్‌మన్ డొమింగో, నియా లాంగ్, మైల్స్ టెల్లర్ వంటి హాలీవుడ్ ప్రముఖ నటీనటులు కీలక పాత్రలు పోషించారు.

## నటుడు ప్రభాస్ లెజెండ్

ధురంధర్ దర్శకుడు ఆదిత్యధర్ కితాబు



**టాకీస్:** బాలీవుడ్ సెన్సేషన్ డైరెక్టర్ ఆదిత్య ధర్ మన రెబల్ స్టార్ ప్రభాస్ కు 'లెజెండ్' అంటూ కితాబిచ్చేశారు.

టాకీస్: రెబల్ స్టార్.. ఇండియాస్ బిగ్గెస్ట్ సూపర్ స్టార్ ఇవి ప్రభాస్ ను ఫ్యాన్స్ ముద్దుగా పిలుచుకునే పేర్లు. ఈశ్వర్ తో మొదలైన ప్రభాస్ జర్నీ నేడు దేశం గర్వించే రేంజ్ కు చేరుకుంది. కానీ మన డార్లింగ్ చాలా సింపుల్ గా కూల్ గా ఉంటాడు తప్ప స్టార్‌డమ్ గురించి ఎప్పుడూ గొప్పలు చెప్పుకోరు. ఎంతటి వారైనా ప్రభాస్ తో కలిసి వర్క్ చేసారంటే ప్రేమలో పడిపోవాల్సిందే. తాజాగా ఇటీవల సందీప్ రెడ్డి వంగాతో కలిసి 'ధురంధర్ 2' సినిమాను వీక్షించారు ప్రభాస్. అయితే, సినిమా చూసి సైలెంట్‌గానే వెళ్ళిపోయాడు డార్లింగ్. కనీసం సోషల్ మీడియాలో రివ్యూ కూడా ఇవ్వలేదు. కానీ, ఆ సినిమా దర్శకుడు ఆదిత్య ధర్ స్పందించిన తీరు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. సందీప్ రెడ్డి వంగా చేసిన పోస్ట్‌కు రిప్లై ఇచ్చిన ఆదిత్య.. 'ది లెజెండ్ ప్రభాస్ సర్‌కి నా ప్రేమను తెలియజేయండి' అంటూ ట్వీట్ చేశారు.



## మధుబాల బయోపిక్‌లో ట్రెండింగ్ హీరోయిన్!

**టాకీస్:** తన అందం, అభినయంతో అతి తక్కువ కాలంలోనే భారతీయ సినిమా పరిశ్రమలో తనదైన ముద్ర వేసింది మధుబాల.అలాంటి దిగ్గజ నటి జీవిత కథ ఆధారంగా ఇప్పుడు ఓ సినిమా తెరకెక్కుతోంది. మొన్నటివరకు ఈ బయోపిక్ లో సాయి పల్లవి నటిస్తుందని ప్రచారం జరిగింది. కానీ ఇప్పుడు.. 'ధురందర్' , 'ధురందర్: ది రివెంజ్' చిత్రాల విజయంతో సారా అర్జున్ క్రేజ్ అమాంతం పెరిగిపోయింది. ఇప్పుడీ అమ్మడికి వరుసగా అవకాశాలు క్యూ కడుతున్నాయి. ఇప్పటికే యుఫోరియా సినిమాలతో తన నటనతో ఆక్టటుకున్న ఈ ముద్దుగుమ్మ ఇప్పుడు తన కెరీర్‌లోనే అత్యంత సవాలుతో కూడిన పాత్రకు సిద్ధమవుతోంది. భారతీయ సినిమా దిగ్గజం, ఎవర్ గ్రీన్ బ్యూటీ మధుబాల బయోపిక్‌లో సారా అర్జున్ ఆమె పాత్రను పోషించనున్నారని వార్తలు వస్తున్నాయి . ఈ చిత్రానికి 'డార్లింగ్స్' ఫేమ్ దర్శకుడు జస్మీత్ కె. రెయిన్ దర్శకత్వం వహిస్తుండగా, ప్రముఖ నిర్మాత సంజయ్ లీలా భన్సాలీ నిర్మిస్తున్నారు. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ దశలో ఉంది. ఈ ఏడాది చివరి నాటికి చిత్రీకరణ ప్రారంభమయ్యే అవకాశం ఉంది. మధుబాల స్వర్ణయుగాన్ని పునఃసృష్టించేందుకు చిత్ర బృందం భారీ సన్నాహాలు చేస్తోంది. ఈ చిత్రంపై భారీ అంచనాలు ఉన్నాయి. ఆ అంచనాలకు అనుగుణంగా చిత్రాన్ని తీర్చిదిద్దేందుకు చాలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. కాగా మధుబాల ఆకర్షణ, అందాన్ని తెరపైకి తీసుకురావడానికి సారా అర్జున్ చాలా కష్టపడాల్సి ఉంది. ఈ క్రమంలో ఆ కాలం నాటి భాషా శైలిలో ప్రావీణ్యం సంపాదించడానికి సారాకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారని తెలుస్తోంది. మధుబాల ఐకానిక్ లుక్స్‌ను రీక్రియేట్ చేసేందుకు ఇప్పటికే అనేక లుక్ టెస్ట్‌లు జరుగుతున్నాయని సమాచారం. దర్శకుడు జస్మీత్ కె. రీన్ ఈ చిత్రాన్ని కేవలం ఒక విజయగాథగా కాకుండా, మధుబాల జీవితంలోని ఒడిదుడుకులను, భావోద్వేగ సంఘర్షణలను చిత్రీకరించే ఒక ఇంటెన్స్ డ్రామాగా తీర్చిదిద్దుతున్నారు. ఈ చిత్రం మధుబాల వ్యక్తిగత జీవితంలోని రహస్యాలతో పాటు ఆమె కెరీర్‌లోని మైలురాళ్లను ఆవిష్కరిస్తుందని సమాచారం. "భారతీయ సినిమా రంగంలో అత్యంత అభిమానించే నటీమణులలో ఒకరి జీవిత కథ ఆధారంగా సినిమా తీయడం ఒక బాధ్యతాయుతమైన పని. సారా అర్జున్ ఆ పాత్రకు న్యాయం చేస్తుందని మాకు పూర్తి నమ్మకం ఉంది," అని చిత్ర బృందంలోని ఒక వ్యక్తి చెప్పినట్లు సమాచారం.



## కథలో బలం లేకున్నా కథనంలో కొత్తదనం

డెకాయిట్‌గా ఫర్వాలేదనిపించిన అడవిశేష్



**టాకీస్:** అడివి శేష్ డబుల్ హ్యాట్రిక్ విజయాలతో జోరు మీదున్నారు. పైగా 'మేజర్'తో జాతీయ స్థాయిలోనూ గుర్తింపు తెచ్చుకున్నాడు. దీంతో ఇప్పుడాయన నుంచి రానున్న 'డెకాయిట్'పై ఇటు దక్షిణాదిలోనూ.. అటు ఉత్తరాదిలోనూ మంచి అంచనాలు ఏర్పడ్డాయి. హరిదాస్ (అడివి శేష్) ఓ హత్య కేసులో 13 ఏళ్లుగా జైలు జీవితం అనుభవిస్తుంటాడు. ఓరోజు తనని కడప జైలు నుంచి మారుస్తుండగా పోలీసుల నుంచి తప్పించు కుంటాడు. దీనికోసం ఇషాద్ భాయ్ (అతుల్ కులకర్ణి) అతనికి సాయం చేస్తాడు. హరి అలా తప్పించుకోగానే తనని దుబాయ్ పంపేందుకు అన్ని ఏర్పాట్లు చేయగా.. దానికోసం ఇంకా రూ. 60లక్షలకు పైగా డబ్బు అవసరమవుతుంది. అయితే అతను దుబాయ్‌కి వెళ్లేలోపు తనకు అవసరమైన డబ్బు సంపాదించడంతో పాటు మరో పని కూడా చేయాలను కుంటాడు. తనని జైలు పాలయ్యేలా చేసిన తన మాజీ ప్రేయసి సరస్వతి అలియాస్ జూలియట్ (మృణాల్ ఠాకూర్)పై పగ తీర్చుకోవాలని నిర్ణయించుకుంటాడు. ఈక్రమంలోనే ఆమెను వెతుక్కుంటూ ఇంటికెళ్లగా ఓ ఆరేళ్ల కూతురి తల్లిగా దర్శనమిస్తుంది సరస్వతి. ఆమె భర్త భాస్కర్ (వైభవ్) తీవ్ర అనారోగ్యానికి గురై ఆస్పత్రి పాలై ఉంటాడు. తన ప్రాణాలు కాపాడాలంటే ఆమెకు రూ. 1కోటి డబ్బు అవసరం. ఆమె పరిస్థితిని చూసిన హరి.. తన ఆర్థిక అవసరాన్ని అడ్డం పెట్టుకునే దెబ్బ కొట్టాలని ఓ ప్రణాళిక రచిస్తాడు. హరిని సరస్వతి హత్య కేసులో ఎందుకు ఇరికించింది? దీనికి ఆమె భర్త భాస్కర్‌కు ఉన్న లింకేంటి? ఈ కథలో సీఐ స్వామి అలియాస్ రాంబాబు (అనురాగ్ కశ్యప్), కరుణ హాస్పిటల్స్ ఛైర్మన్ (ప్రకాశ్ రాజ్), మల్లి (కామాక్షి భాస్కర్ల) పాత్రలకు ఉన్న ప్రాధాన్యత ఏంటన్నదే కథ. అడివి శేష్ సినిమా అనగానే ప్రేక్షకుల్లో బలమైన భరోసా కనిపిస్తుంది. తను ఓ కథ ఎంచుకున్నాడంటే తప్పకుండా అందులో ఏదో వైవిధ్యత ఉంటుందని.. థ్రిల్‌కు ఏ లోటు ఉండదని అందరి నమ్మకం. ఇక ఈసారి 'డెకాయిట్'కి తనే స్వయంగా కథ, స్క్రీన్‌ప్లే అందించాడనే సరికి దీనిపై ప్రేక్షకుల్లో అంచనాలు మరింత రెట్టింపయ్యాయి. కథ, కథనాల్లో మరీ అంత కొత్తదనమేమీ లేకపోయినా కొన్ని మెరుపులతో ఆ లోటు తెలియనీయలేదు. ఓ కులాంతర ప్రేమకథకు.. తనదైన శైలిలో ట్విస్ట్‌లు, టర్న్‌లు జోడించి ఓ మాస్ యాక్షన్ సినిమాని ఆవిష్కరించే ప్రయత్నం చేశారు శేష్.

## కొరియన్ కనకరాజు నుంచి 'కమ్సాహంనిదా' పాట ప్రోమో




**టాకీస్:** మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్, దర్శకుడు మేర్లపాక గాంధీ కాంబినేషన్‌లో వస్తున్న లేటెస్ట్ క్రేజీ ప్రాజెక్ట్ 'కొరియన్ కనకరాజు' . ఇండో-కొరియన్ నేపథ్యంలో హారర్-కామెడీ జోనర్‌లో తెరకెక్కుతున్న ఈ సినిమా మ్యూజికల్ ప్రమోషన్స్‌ను చిత్ర బృందం ఘనంగా ప్రారంభించింది. ఈ చిత్రంలోని మొదటి పాట 'కమ్సాహంనిదా' ప్రోమోను తాజాగా విడుదల చేయగా, దీనికి విశేష స్పందన లభిస్తోంది. సంగీత దర్శకుడు ఎస్. థమన్, వరుణ్ తేజ్ మరియు దర్శకుడు మేర్లపాక గాంధీ మధ్య సాగే ఫన్నీ సంభాషణలతో కూడిన ఈ ప్రోమో యూట్యూబ్‌లో ట్రెండింగ్‌గా నిలిచింది. మెలోడీ కింగ్ సిద్ శ్రీరామ్ ఆలపించిన ఈ పూర్తి పాటను ఏప్రిల్ 11న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ చిత్రంలో వరుణ్ తేజ్ సరసన రితికా నాయక్ కథానాయికగా నటిస్తుండగా, స్టార్ కమెడియన్ సత్య కీలకమైన వినోదాత్మక పాత్రలో అలరించనున్నారు. కొరియా సంస్కృతికి మరియు లోకల్ క్యారెక్టర్ అయిన కనకరాజుకు మధ్య ఉన్న విచిత్రమైన సంబంధాన్ని దర్శకుడు మేర్లపాక గాంధీ తన మార్కు వినోదంతో వెండితెరపై ఆవిష్కరించబోతున్నాడు. ఇప్పటికే మేజర్ షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం, ఆఖరి షెడ్యూల్‌ను దక్షిణ కొరియాలోని అందమైన లొకేషన్లలో పూర్తి చేసుకోబోతుంది. యూవీ క్రియేషన్స్ మరియు ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై వంశీ, ప్రమోద్ మరియు విక్రమ్ ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. వరుస పరాజయాల తర్వాత వరుణ్ తేజ్ ఈ డిఫరెంట్ కథాంశంతో మళ్లీ హిట్ ట్రాక్ ఎక్కడం ఖాయమని అభిమానులు ఆశిస్తున్నారు. మనోజ్ రెడ్డి సినిమాటోగ్రఫీ అందిస్తున్న ఈ సినిమాను 2026 వేసవి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు.

## దసరాకు రిలీజ్ చేసేలా.. ఫౌజీ షూటింగ్ స్పీడ్

**టాకీస్:** ఈ ఏడాది ఆరంభంలో రాజాసాబ్‌తో ఫ్లాప్ ఇచ్చిన రెబల్ స్టార్ ప్రభాస్.. ఇదే ఏడాదిలో సాలిడ్ హిట్ ఇవ్వాలని డిసైడ్ అయ్యాడు. ప్రభాస్ నుంచి 'ఫౌజీ' సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. సీతారామం తర్వాత దర్శకుడు హను రాఘవపూడి తెరకెక్కిస్తున్న ఈ సినిమా సెకండ్ వరల్డ్ వార్ బ్యాక్ డ్రాప్‌లో రూపొందుతోంది. ఇప్పటికే మేజర్ పార్ట్ షూటింగ్ కంప్లీట్ చేసుకుంది. అఫీషియల్‌గా ప్రకటించనప్పటికీ.. వచ్చే దసరాకు ఫౌజీని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు మేకర్స్. కానీ ఈ ఏడాది డిసెంబరు పోస్ట్‌పోన్ అయ్యే ఛాన్స్ ఉందనే టాక్ వినిపిస్తోంది. అయితే చిత్ర యూనిట్ మాత్రం ఈ సినిమాను ముందుగా అనుకున్న సమయానికే ప్రేక్షకులకు అందించాలని పట్టుదలతో ఉంది. ఇందుకోసం నిర్మాణ పనులను ముమ్మరం చేస్తూ ఏకకాలంలో షూటింగ్‌ను పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేసింది. షెడ్యూల్ ప్రకారం సినిమాను పూర్తి చేయడం కోసం మేకర్స్ 'సెకండ్ యూనిట్'ను కూడా రంగంలోకి దించినట్టుగా తెలుస్తోంది. ప్రస్తుతం ఒక వైపు ప్రధాన తారాగణంపై దర్శకుడు హను రాఘవపూడి అత్యంత కీలకమైన సన్నివేశాలను చిత్రీకరిస్తుండగా, మరోవైపు ఈ సెకండ్ యూనిట్ సినిమాలోని యాక్షన్ ఎపిసోడ్స్‌ను షూట్ చేస్తోందట. ఇలా రెండు యూనిట్‌లతో పని చేయడం వల్ల సమయం ఆదా అవ్వడమే కాకుండా, క్వాలిటీ విషయంలో కూడా ఎక్కడా రాజీ పడకుండా అవుట్‌పుట్ వస్తుందని టీమ్ భావిస్తోంది.




Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.